RNI Regd. No. TELTEL/2023/86207

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

మేడ్చల్ మల్కాజ్‌గిరి సంపుటి : 3 సంచిక : 179 శుక్రవారం 25 జూలై 2025 పేజీలు : 4

## స్వతంత్ర దేశంగా బలూచిస్థాన్!

న్యూఢిల్లీ : భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్‌తో ఇప్పటికే ఉక్కిరిబిక్కిరి అవుతున్న పాకిస్థాన్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. పాకిస్థాన్‌లోనే అతి పెద్ద ప్రావిన్స్(విస్తీర్ణం పరంగా) అయిన బలూ చిస్థాన్.. పాకిస్థాన్ నుంచి విడిపోతున్నట్టు బలూచ్ నేతలు ప్రకటించారు. అంతేకాక బలూచిస్థాన్‌ను ప్రత్యేక దేశంగా గుర్తించాలని భారత్, ఐక్యరాజ్యసమితిని కోరారు. ఈ మేరకు బలూచిస్థాన్ నాయకుడు మీర్ యార్ బలూచ్ ఎక్స్‌లో పలు పోస్టులు చేశారు. రిపబ్లిక్ ఆఫ్ బలూచిస్థాన్ ఏర్పాటును తన పోస్టుల్లో ప్రకటించారు. అలాగే, న్యూఢిల్లీలో బలూచిస్థాన్ రాయబార కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని భారత ప్రభుత్వాన్ని కోరారు. తమను దేశంగా గుర్తించి.. కరెన్సీ, పాస్‌పోర్టు జారీ వంటి ప్రాథమిక అవసరా లకు నిధులు సమకూర్చాలని ఐక్యరాజ్యసమితిని అభ్యర్థించారు.

# కాంగ్రెస్ ఒత్తిడి మేరకే దేశ వ్యాప్త కులగణనకు అంగీకారం

## ఓబీసీలకు ప్రధాని మోదీ ఏమి చేశారో చెప్పాలి!




న్యూఢిల్లీ, జులై 24: పుట్టుకతో ప్రధాని నరేంద్ర మోదీ ఓబీసీ కాదని.. ఆయన లీగల్లీ కన్వర్టెడ్ ఓబీసీ అని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఓబీసీల కోసం ప్రధాని మోదీ మనస్ఫూర్తిగా చేసిందేమీ లేదని కుండబద్దలు కొట్టారు. అయితే దేశం కోసం కాంగ్రెస్ పార్టీ మాత్రమే త్యాగాలు చేసిందని వివరించారు. గురువారం న్యూఢిల్లీలో కుల గణనపై సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ మోడల్ అంటే ఏమిటో తెలిపేందుకే ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇస్తున్నట్లు తెలిపారు. భారత్ జోడో యాత్రలో కుల గణనపై రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తెలంగాణలో అధికారంలోకి రాగానే కుల గణన సర్వే చేశామన్నారు. దేశానికి ఒక దశ దిశను చూపించేలా ఈ కుల గణన సర్వే చేపట్టామని ఆయన వివరించారు. దాదాపు వందేళ్ల తర్వాత కుల గణన ప్రక్రియ నిర్వహించామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఒత్తిడితోనే దేశవ్యాప్త కుల గణనకు కేంద్రం దిగి వచ్చిందని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

**తెలంగాణలో కుల గణన ఓ చరిత్ర: డిప్యూటీ సీఎం మల్లు...** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కుల గణన చేస్తామని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. రాహుల్ హామీ మేరకు రాష్ట్రంలో కుల గణన చేపట్టామని వివరించారు. అందుకు తగ్గట్లుగా ఎవరి జనాభా ఎంత అనేది తేల్చామన్నారు. తెలంగాణలో కుల గణన ఓ చరిత్ర అని ఆయన అభివర్ణించారు. కుల గణనతో దేశంలోనే తెలంగాణ ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. దాదాపు 2 లక్షల మంది సిబ్బందితో 50 రోజుల్లో ఈ సర్వే నిర్వహించామని వివరించారు. తెలంగాణ మొత్తాన్ని బ్లాక్‌లుగా విభజించి సర్వే నిర్వహించామని చెప్పారు. ఎలాంటి పొరపాట్లు లేకుండా కుల గణన సర్వే చేపట్టామని తెలిపారు. 150 ఇళ్లకు ఒక్కో ఎన్యుమరేటర్‌ను నియమించి ఈ సర్వే చేపట్టామని పేర్కొన్నారు. విస్తృత సంప్రదింపులతో కుల గణన సర్వే సాకారం చేశామన్నారు. కుల గణన సర్వేను తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదించిందని చెప్పారు. అసెంబ్లీ అనుమతితో రిపోర్ట్‌పై నిపుణుల కమిటీ సైతం వేశామని చెప్పారు. నిపుణుల కమిటీ కొన్ని కీలక సూచనలు చేసిందన్నారు. ఈ కమిటీ సూచనలపై అసెంబ్లీలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క చెప్పారు.

**సీఎం పవర్ పాయింట్ ప్రజెంటేషన్..** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలు చేయడమే ఎజెండాగా తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది.

అందులోభాగంగా బీసీ కులగణన, బీసీ రిజర్వేషన్ బిల్లు అంశాలపై కాంగ్రెస్ ఎంపీలకు సీఎం రేవంత్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నారు. న్యూఢిల్లీలోకి కొత్త ఏఐసీసీ కార్యాలయం ఇందిరా భవన్‌లో సీఎం రేవంత్ రెడ్డి ఈ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.




## రేవంత్ సర్కార్‌పై రాహుల్ ప్రశంసలు

న్యూఢిల్లీ, జులై 24: రేవంత్ రెడ్డి సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ ప్రశంసల జల్లు కురిపించారు. తెలంగాణలో కుల గణనను ప్రభుత్వం స్ఫూర్తిదాయకంగా నిర్వహించిందని ఆయన పేర్కొన్నారు. గురువారం న్యూఢిల్లీలో ఏఐసీసీ నూతన కార్యాలయం ఇందిరా భవన్‌లో తెలంగాణలో కుల గణన సర్వేపై సీఎం రేవంత్ రెడ్డి ప్రవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. తెలంగాణలో కుల గణన సర్వే చేపట్టాలని ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు వచ్చినట్లు ఆయన స్పష్టం చేశారు. 55 ప్రశ్నలతో క్షేత్ర స్థాయిలో ఇంటింటికీ వెళ్లి ఈ కుల గణన చేపట్టారని రాహుల్ వివరించారు. విజయవంతంగా కుల గణన నిర్వహించడమంటే అంత ఈజీ కాదన్నారు. రేవంత్ సహా కాంగ్రెస్ పార్టీ నేతలు అంచనాలకు మించి రాణించారని కితాబు ఇచ్చారు. దేశంలో సామాజిక న్యాయానికి ఇదో మైలురాయిగా నిలుస్తుందని రాహుల్ అభివర్ణించారు. దేశ వ్యాప్తంగా కుల గణన చేపట్టాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా రాహుల్ గాంధీ స్పష్టం చేశారు.



## ఛత్తీస్‌గఢ్‌లో 51 మంది మావోయిస్టుల లొంగుబాటు!

చర్ల: ఛత్తీస్‌గఢ్‌లో పెద్దఎత్తున మావోయిస్టులు పోలీసుల ఎదుట లొంగిపోయారు. నారాయణపూర్, సుక్మా, బీజాపూర్, కాంకేర్ జిల్లాల్లో కలిపి మొత్తం 51 మంది ఆయుధాలు వీడారు. మావోయిస్టు వ్యతిరేక ఆపరేషన్లు ముమ్మరం చేయడం, ప్రభుత్వ పునరావాస విధానం అమలుతో నక్సల్స్ కార్యకలాపాలు పూర్తిగా తగ్గిపోతున్నట్లు బస్తర్ ఐజీ సుందర్‌రాజ్ తెలిపారు. 2024 నుంచి ఇప్పటివరకు బీజాపుర్ జిల్లాలో జరిగిన వివిధ ఎన్‌కౌంటర్‌లలో 185 మంది మావోయిస్టులు హతమయ్యారని, 803 మంది అరెస్టు కాగా.. 431 మంది లొంగిపోయారన్నారు. బీజాపూర్ జిల్లాలో బస్తర్ ఐజీ సుందర్ రాజ్ ఎదుట 25 మంది లొంగిపోయారు. వీరిపై రూ.1.15 కోట్ల మేర రివార్డు ఉన్నట్టు ఐజీ వెల్లడించారు.

ప్రోత్సాహకంగా వారికి రూ.50 వేల చొప్పున చెక్కులు అందజేశారు. కాంకేర్ జిల్లా ఎస్పీ కల్యాణ్ ఎలిసెల ఎదుట 13 మంది లొంగిపోయారు. వీరిలో మిలటరీ కంపెనీ కమాండర్ మంగులు ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. వీరిపై రూ.62 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు. సుక్మా ఎస్పీ కిరణ్ జవాన్ ఎదుట ఐదుగురు లొంగిపోయారు. వీరిపై రూ.6 లక్షల రివార్డు ఉంది. వారిలో కొంతమంది గతంలో పలు విధ్వంసకర ఘటనల్లో పాల్గొన్నట్లు పోలీసులు తెలిపారు. నారాయణపూర్ ఎస్పీ రాబిన్‌సన్ గుడియా ఎదుట నలుగురు మహిళా మావోయిస్టులు సహా ఎనిమిది మంది లొంగిపోయారు. వీరిలో కమాండర్ కమలేశ్ ఉన్నట్లు ఎస్పీ వెల్లడించారు. వీరందరిపై రూ.33 లక్షల రివార్డు ఉన్నట్లు తెలిపారు.

## పార్టీ విధేయుడికే ఉపరాష్ట్రపతి పదవి! వారికి ఛాన్స్ లేనట్లే!






ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖర్ అకస్మాత్తుగా రాజీనామా చేశారు. ఊహించని రీతిలో ఆయన పదవి నుంచి తప్పుకోవడం రాజకీయ వర్గాల్లో తీవ్ర కలకలం రేపింది. ఇంత సడన్‌గా రాజీనామా ఎందుకు చేశారంటూ రకరకాలైన ఊహాగానాలు వచ్చాయి. అనారోగ్యం కారణంగా రాజీనామా చేసినట్లు ఆయన చెబుతున్నా.. అంతర్గతంగా ఏదో జరిగిందంటూ విపక్షాలు కోడైకూస్తున్నాయి. మొత్తానికి రెండేళ్ల పదవి ఉండగానే ధన్‌ఖర్ తప్పుకున్నారు. ఇప్పుడు ఆయన వారసుడి కోసం హైకమాండ్ తీవ్ర కసరత్తు చేస్తోంది. ఈసారి మిత్రపక్షాలకు ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వొచ్చని పొలిటికల్ సర్కిల్‌లో అనేకమైన పుకార్లు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా బీహార్‌లో ఈసారి బలం పుంజుకునేందుకు నితీష్ కుమార్‌కు ఉపరాష్ట్రపతి పదవి కట్టబెట్టి.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయొచ్చని వార్తలు వినిపించాయి. ఇక రాజ్యసభలో డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న హరివంశ్‌కు ఇవ్వొచ్చని ప్రచారం జరిగింది. ఇక కాంగ్రెస్‌కు దూరంగా ఉంటూ.. బీజేపీకి దగ్గరగా ఉన్న శశిథరూర్‌కు ఆ పదవి కట్టబెట్టొచ్చని ఊహాగానాలు వెలువడ్డాయి. ఇలా రకరకాలైన పేర్లు వ్యాప్తి చెందుతున్నాయి. తాజాగా ఈ ఊహాగానాలకు బీజేపీ చెక్ పెట్టింది. ఈసారి ఉపరాష్ట్రపతి పదవిని పార్టీ విధేయులకే ఇస్తారని ఆ పార్టీ వర్గాలు పేర్కొంటున్నాయి. పార్టీ భావజాలంతో దగ్గర సంబంధం కలిగి ఉన్న వ్యక్తే తదుపరి ఉపరాష్ట్రపతి అవుతారని చెబుతున్నాయి. ఇటీవల జేడీయూ నాయకుడు, కేంద్రమంత్రి రామ్‌రాథ్ ఠాకూర్.. బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిశారు. దీంతో ఉపరాష్ట్రపతి పదవిని ఠాకూర్‌కు ఇవ్వొచ్చని జోరుగా ప్రచారం సాగింది. అయితే ఈ వార్తలను బీజేపీ వర్గాలు తీవ్రంగా తోసిపుచ్చాయి. సాధారణ సమావేశమే తప్ప.. అందులో విశేషం ఏమీలేదని తేల్చేశాయి. ఆ పదవి గురించే చర్చ జరగలేదన్నారు. ఇదిలా ఉంటే ఉప రాష్ట్రపతి ఎన్నిక ప్రక్రియ కోసం ఈసీ కసరత్తు ప్రారంభించింది. ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటుకు చర్యలు చేపట్టామని తెలిపింది. పార్లమెంటు ఉభయసభలకు ఎన్నికైన, నామినేటెడ్ సభ్యులతో ఈ ఎలక్టోరల్ కాలేజ్ ఏర్పాటు కానుంది. త్వరలో దీనిపై షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలున్నాయి. అధికారిక కార్యక్రమాలు పూర్తయిన తర్వాత ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటిస్తామని ఎన్నికల సంఘం ఒక ప్రెస్ నోట్‌లో తెలిపింది.




## స్థానిక రిజర్వేషన్లపై బిగ్ అప్‌డేట్..

# నేడే రిజర్వేషన్ల ఖరారు!

తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మరోవైపు ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి చట్టబద్ధత కల్పనకు పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో త్వరలో ఆర్డినెన్స్ సైతం తీసుకురానుంది. అయితే మొదటి నెల రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాలని, ఆ తర్వాతి 2 నెలల్లో ఎన్నికలు నిర్వహించాలని స్పష్టం చేసింది.

రిజర్వేషన్లపై ప్రభు త్వం విధించిన గడువు రేపటితో ముగియనుంది. కానీ ఇప్పటి వరకు స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లపై స్పష్టత రాలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం ఈ నెల 10న రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. అనంతరం గవర్నర్కు పంపిన ఆర్డినెన్స్ను రాజ్ భవన్ నుంచి స్పష్టత రావడం లేదు. దీంతో ఆర్డినెన్స్ ఎప్పుడు జారీ అవుతుంది? రిజర్వేషన్లు ఎలా ఉంటాయి? అనే అంశాలు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ రేకెత్తిస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీల సన్నాహాలతో స్థానిక సంస్థల ఎన్నికల రాజుకుంటున్న నేపథ్యంలో గతంతో పోల్చితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఏ విధంగా ఉండవచ్చనేది చర్చనీయాంశంగా మారింది. గవర్నర్ న్యాయనిపుణుల అభిప్రాయాలు సేకరిస్తున్నారని, ఆర్డినెన్స్ను నిర్ణయం తెలిపేందుకు మరికొంత సమయం పట్టే అవకాశం ఉందని తెలిసింది. బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చే అంశంపై కేంద్రం సైతం ఇంత వరకు ఎలాంటి ముందడుగూ వేయలేదు. కేంద్ర మంత్రులు, బీజేపీ నాయకుల ప్రకటనలు పరిశీలిస్తే ఈ విషయం ఇప్పట్లో తేలదని స్పష్టమవుతున్నది. దీంతో రిజర్వేషన్లపై ఎప్పుడు స్పష్టత వస్తుందోననే ఉత్కంఠ నెలకొంది. పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం చూస్తే..అన్ని రిజర్వేషన్లు కలుపుకొని 50 శాతానికి లోబడి ఉండాలి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ప్రస్తుతం ఉన్న 22 శాతం రిజర్వేషన్లను, 42 శాతానికి పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆర్డినెన్స్ తేనుండటంతో.. అందులో పొందుపరిచే అంశాలు, బీసీ జనాభా లెక్కలు, వాటిని బట్టి మారే రిజర్వేషన్లు చర్చనీయాంశమయ్యాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వారి జనాభా ప్రాతిపదికన ఖరారు కానున్నందున వాటి విషయంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చునని అంటున్నారు. అయితే రిజర్వేషన్లు మొత్తంగా మారిపోయే అవకాశం ఉందని, కాబట్టి ఎస్సీ,ఎస్టీ స్థానాలు కూడా కొంత మేరకు ప్రభావితం కావచ్చునని చెబుతున్నారు. వార్డు స్థానాలు మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ అధ్యక్షులు, జడ్పీ ఛైర్పర్సన్ స్థానాల వరకు రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు.

ఇప్పటివరకు.. గతంలో ఉన్న రిజర్వేషన్లు రెండు పదవీ కాలాల (టర్మ్లు) సమయం కొనసాగాయి. ఇప్పుడు ఒకే టర్మ్కు రిజర్వేషన్లు పరిమితం కానున్నాయి. అంటే ఈసారి నిర్ణయించే రిజర్వేషన్లు ఒక టర్మ్ మాత్రమే ఉంటాయన్న మాట. ఈ కారణంగానూ రిజర్వేషన్ స్థానాల్లో అనేక మార్పులు చోటు చేసుకోవచ్చునని అంటున్నారు.

**రేపే రిజర్వేషన్ల ఖరారు?...** హైకోర్టు తీర్పు ప్రకారం మొదటి నెల రోజుల్లో రిజర్వేషన్లను ఖరారు చేయాల్సి ఉంది. దీని ప్రకారం రేపటితో ఆ గడువు ముగియనుంది. అయితే గవర్నర్ ఆమోదం కానీ, కేంద్ర ప్రభుత్వ ఆమోదం కానీ ఇంతవరకు లభించలేదు. గవర్నర్ న్యాయ నిపుణుల అభిప్రాయాలు సేకరిస్తున్నారన్న ప్రచారం సాగుతోంది. ఒకవేళ అదే కనుక జరిగితే రేపు గవర్నర్ నిర్ణయం తీసుకోవచ్చు. గవర్నర్ ఆమోదం తెలిపితే రేపే రిజర్వేషన్లు ఖరారు చేసే అవకాశం ఉంది. మరోవైపు పంచాయతీరాజ్ చట్టం-2018 ను సవరించాలని కేంద్రం పై ఒత్తిడి తేవడానికి కాంగ్రెస్ పార్టీ ప్రయత్నం చేస్తోంది. కానీ, అది అంత తొందరగా తేలే అంశం కాకపోవడంతో స్థానిక సంస్థలపై ఉత్కంఠ నెలకొంది. హైకోర్టు తీర్పు ప్రకారం సెప్టెంబర్ 30 లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉన్నందున గవర్నర్ ఆర్డినెన్స్ను ఎలాంటి నిర్ణయం తీసుకోనట్లయితే కాంగ్రెస్ పార్టీ ప్రకటించే అభ్యర్థుల వరకు రిజర్వేషన్లు అమలు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. అంటే పార్టీ ప్రకారం రిజర్వేషన్లు కేటాయిస్తే కాంగ్రెస్ టికెట్లు 42 శాతం బీసీలకు లభించే అవకాశం ఉంది.

గరుడ వార్త



# సంపాదకీయం

## బీజేపీని ఇరుకున పెడుతోన్న రేవంత్

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని, బండారు దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇవ్వాలని చేసిన డిమాండ్ ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. ఇది కేవలం ఒక సామాజిక న్యాయ పోరాటమా లేక దీని వెనుక బలమైన రాజకీయ వ్యూహం ఉందా అనే కోణంలో విశ్లేషణ జరుగుతోంది.

**బీసీలకు న్యాయం చేసే చర్యగా?...** రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను పరిశీలిస్తే, దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవిని ప్రతిపాదించడం ద్వారా బీసీలకు ఉన్నత స్థాయిలో ప్రాతినిధ్యం కల్పించాలనే తన సంకల్పాన్ని స్పష్టం చేశారు. భారత రాజ్యాంగ వ్యవస్థలో ఉపరాష్ట్రపతి వంటి అత్యున్నత స్థానం ఒక సామాజికంగా వెనుకబడిన వర్గానికి దక్కితే, అది సామాజిక న్యాయానికి గొప్ప ఊతమిస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. గతంలో దత్తాత్రేయను హర్యానా గవర్నర్‌గా నియమించినప్పటికీ, ఆ తర్వాత ఆ పదవి నుంచి తొలగించడాన్ని బీజేపీ బీసీ వ్యతిరేక ధోరణికి ఉదాహరణగా రేవంత్ పేర్కొనడం గమనార్హం. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రధాని మోడీ గౌరవించాలని, దత్తాత్రేయకు ఈ పదవి ఇస్తే బీసీలతో పాటు తెలంగాణకు న్యాయం జరుగుతుందని ఆయన అన్నారు.

**రాజకీయ వ్యూహం వెనకదాగినదేనా?..** ఈ డిమాండ్‌ను రాజకీయ కోణంలో చూసినప్పుడు కొన్ని అంశాలు స్పష్టంగా గోచరిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో ఎన్డీయేకు వ్యతిరేకంగా ఇండియా కూటమి ప్రాభవం పుంజుకుంటున్న సమయంలో రేవంత్ రెడ్డి ఈ డిమాండ్‌ను లేవనెత్తడం వ్యూహాత్మకం అని చెప్పవచ్చు. దత్తాత్రేయపై రేవంత్ చేసిన డిమాండ్ ద్వారానే బీసీలను కాంగ్రెస్ పార్టీ వైపుకు మరింతగా ఆకర్షించాలన్న యత్నం కనిపిస్తోంది. ముఖ్యంగా దక్షిణ భారత రాష్ట్రాల్లో బీసీ ఓటు బ్యాంకును పటిష్టం చేయడమే ఈ వ్యాఖ్యల వెనక ఉన్న ప్రధాన ఉద్దేశ్యంగా భావించవచ్చు. “ఇది ఇండియా కూటమి తరపున కాదు, తెలంగాణ ప్రజల తరపున అడుగుతున్నాను” అని రేవంత్ చెప్పినప్పటికీ, బీజేపీ దత్తాత్రేయకు ఉపరాష్ట్రపతి పదవి ఇస్తే, ఇండియా కూటమితో మాట్లాడే బాధ్యత తాను తీసుకుంటానని చెప్పడం కాంగ్రెస్ పార్టీలో ఆయనకున్న స్థానం, దూకుడుకు నిదర్శనం.

**భవిష్యత్ రాజకీయాలకు సంకేతమేనా?...** రేవంత్ రెడ్డి వ్యాఖ్యలతో కాంగ్రెస్ పార్టీ భారత రాజకీయాల్లో బీసీ వర్గాలకు సంబంధించిన కొత్త వ్యూహానికి శ్రీకారం చుట్టిందని చెప్పవచ్చు. ఇకపై జాతీయ స్థాయిలో బీసీలకు మరింత ప్రాధాన్యత ఇచ్చేలా, కీలక పదవులు వారికిచ్చేలా ఒక డిమాండ్ వేదికను ఏర్పాటు చేయాలని పార్టీ ఆలోచిస్తున్నట్టు స్పష్టమవుతోంది. ఇటీవల తెలంగాణలో కాంగ్రెస్ చేపట్టిన కులగణన కూడా ఈ బీసీ రాజకీయ వ్యూహంలో భాగమేనని పలువురు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉంటే, బీజేపీ తరపున దీనిపై ఇంకా ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. అయితే, బీసీ సామాజిక వర్గంలో ఈ ప్రకటన ప్రభావం చూపే అవకాశముంది. కాంగ్రెస్ పార్టీ బీసీలకు వాగ్దానాలు ఇచ్చి, ఆ వర్గాన్ని తమవైపు తిప్పుకోవాలనుకుంటే, దానికి ఇది మంచి ప్రారంభంగా మారవచ్చు. రేవంత్ రెడ్డి చేసిన డిమాండ్ పలు రాజకీయ, సామాజిక అంశాలను చర్చకు తెస్తోంది. ఒకవైపు ఇది సామాజిక న్యాయపు పిలుపుగా కనిపించినా, మరోవైపు దీని వెనుక రాజకీయ ప్రణాళిక కూడా స్పష్టంగా కనిపిస్తోంది. భవిష్యత్ ఉపరాష్ట్రపతి పదవిపై రాజకీయాలు వేడెక్కే సమయంలో ఈ డిమాండ్ మరింత ప్రాధాన్యత సంతరించుకోనుంది. భారత రాజకీయం, ప్రత్యేకంగా బీసీ రాజకీయాలపై దీని ప్రభావం ఎలా ఉంటుందో వేచి చూడాలి.





## ఉత్తమ విద్యాభ్యాసం కోసం విద్యార్థులకు

# సకల సౌకర్యాలు కల్పిస్తాం....

### మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి











శామీర్ పేట, (గరుడ వార్త) : విద్యార్థులు ఇష్టంగా చదువుకుని మంచి ఫలితాలను సాధించాలని, అందుకు అవసరమైన వసతులను కల్పిస్తామని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. గురువారం శామీర్ పేట్ మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా విద్యా శాఖాధికారి విజయ కుమార్ తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు ఉన్నారని, తరగతి గదులు ఎన్ని ఉన్నాయని హెడ్ మాస్టర్ ను అడిగారు. అదనపు తరగతి గదులు, టాయిలెట్లు అవసరమని హెడ్ మాస్టర్ తెలుపగా, ఇంజనీర్లతో అంచనాలు వేయించి ప్రతిపాదనలు పంపాలని కలెక్టరు సూచించారు. అనంతరం సిలబస్ ఎంత వరకు అయినదని, భోజనం ఎలా ఉంటుందని, హెడ్ మాస్టర్ అడిగినవి కాకుండా ఇంకేమైన మీకు సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కలెక్టరు అడిగారు. అన్ని సౌకర్యాలు బాగున్నాయని, మధ్యాహ్న భోజనం కూడా బాగుంటుందని విద్యార్థులు సమాధాన మిచ్చారు. కలెక్టర్ పాఠశాలనంతా కలియ తిరిగి పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్ ను పరిశీలించారు. విద్యార్థులకు అర్థం కాకుండా గంటల తరబడి తరగతులు తీసుకోవడం కంటే వారికి సులువుగా సారాంశం అర్థమయ్యేలా ఎలా చెప్పాలనే అంశాలను గ్రహించాలని టీచర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో శామీర్ పేట తహసీల్దార్ యాదగిరిరెడ్డి, మున్సిపల్ కమీషనర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సెస్సు.. గ్రంథాలయానికి ఆయుష్షు

సంగారెడ్డి: మార్చి నెలాఖరుతో ఆర్థిక సంవత్సరం ముగిసింది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని చాలా పంచాయతీల్లో శతశాతం ఆస్తి పన్ను వసూలయింది. బల్దియాలకూ ఆశాజనకంగా ఆదాయం సమకూరింది. ఇందులోంచి నిర్దేశిత వాటా ప్రకారం గ్రంథాలయాలకు చెల్లించాల్సిన ‘సెస్’ జమ చేయడం లేదు. ఫలితంగా పుస్తక నిలయాలకు ఇబ్బందులు తప్పడం లేదు. నిధులు లేక ఉమ్మడి జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధి పడకేసింది. మండల కేంద్రాల్లోని పుస్తక నిలయాల్లో ఏళ్లుగా మార్పు కానరావడం లేదు. ఆస్తిపన్నులోని వాటాను గ్రంథాలయాలకు చెల్లిస్తే సమస్య కొంతమేరకైనా గట్టెక్కే వీలుంటుంది.

**అమలుకు నోచని ఆదేశాలు**

గ్రంథాలయాల అభివృద్ధికి పంచాయతీల్లో జమవుతున్న సెస్‌ను చెల్లించాలని ఆ సంస్థ కార్యదర్శులు పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులకు ఆదేశాలు జారీ చేసినా.. స్పందన కరవైంది. ప్రస్తుతం గ్రంథాలయాలకు అభ్యర్థుల తాకిడి అధికమైంది. వివిధ ఉద్యోగాలకు సన్నద్ధమవుతున్నారు. వందలాది మంది నిరుద్యోగులు వస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఇక్కడే ఉండి పోటీపరీక్షలకు సన్నద్ధమవుతున్నారు. గ్రంథాలయాల్లో వసతులు లేమి కారణంగా అభ్యర్థులకు ఇక్కట్లు తప్పడం లేదు. సెస్ బకాయిలు సమకూరితే బల్లలు, కుర్చీలు, పుస్తకాలు తెప్పించే వీలుంది.

**క్షేత్రస్థాయి పరిస్థితి**

సంగారెడ్డిలో జిల్లా లైబ్రరీతో పాటు.. 19 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత నాలుగేళ్లుగా గ్రామ పంచాయతీలు సెస్‌ను జమ చేయడం లేదు. జిల్లా పరిధిలోని జహీరాబాద్, నారాయణ్‌ఖేడ్, జోగిపేట బల్దియాలు సైతం లైబ్రరీ సెస్ జమచేయక ఏళ్లు గడిచాయి. గత నాలుగేళ్ల క్రితం అప్పటి కలెక్టర్ ప్రత్యేక చొరవ తీసుకొని పంచాయతీలతో పాటు బల్దియాల నుంచి పన్ను బకాయిలు రూ.5.18 కోట్లు జమచేయించారు. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ కొనసాగుతోంది. సిద్దిపేటలో జిల్లా గ్రంథాలయంతో పాటు 16 శాఖా గ్రంథాలయాలున్నాయి. గత ఎనిమిదేళ్ల నుంచి పంచాయతీలు సెస్‌ను జమచేయడం లేదు. పురపాలికలు మాత్రం నిర్దేశిత వాటా కింద పన్నులో వాటాను జమ చేస్తున్నాయి. ఈ నిధులతోనే జిల్లాలోని గ్రంథాలయాల నిర్వహణ సాగుతోంది.

మెదక్ జిల్లా గ్రంథాలయంతో పాటు 19 మండల కేంద్రాల్లో మినీ గ్రంథాలయాలున్నాయి. మెదక్, రామాయంపేట మినహా మిగిలిన బల్దియాలు సెస్ జమ చేస్తున్నాయి.

**సౌకర్యాలు మెరుగుపడితేనే..**

ఉమ్మడి మెదక్ పరిధి మూడు జిల్లాల్లోని గ్రంథాలయాల్లో సౌకర్యాలు మెరుగు పడాల్సిన అవసరం ఉంది. సాంకేతికంగా అభివృద్ధి చెందుతున్న నేపథ్యంలో జిల్లా గ్రంథాలయాల్లో డిజిటల్ లైబ్రరీలు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం నిధుల కొరత కారణంగా డిమాండ్‌కు అనుగుణంగా విద్యార్థులు కోరిన కొన్ని పుస్తకాలు మాత్రమే తెప్పిస్తున్నారు. నిబంధనలకు అనుగుణంగా ఉండాల్సిన పుస్తకాలు అందుబాటులో ఉండడం లేదు. ప్రధానంగా పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే వారికి అవసరమయ్యే పుస్తకాలు సమకూర్చాల్సి ఉంది.

**అధికారులు ఏమంటున్నారంటే..**

సెస్ బకాయిలు జమచేయాలని పంచాయతీ కార్యదర్శులతో పాటు బల్దియాల కమిషనర్లకు తాఖీదులు జారీచేశామని సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వసుంధర, మెదక్ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంశీకృష్ణ పేర్కొన్నారు.

## వ్యూహం రచిద్దాం.. పాగా వేద్దాం

సంగారెడ్డి: రానున్న మూడు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించిన నేపథ్యంలో రాజకీయ పార్టీలు ఎన్నికలకు సమాయత్తమవుతున్నాయి. గెలుపే లక్ష్యంగా ప్రధాన పార్టీలైన అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష భారాస, భాజపాలు వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి. పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో పోటీ చేయాలనుకుంటున్న ఆశావహులు రిజర్వేషన్లు అనుకూలిస్తే సిద్ధంగా ఉండేందుకు కసరత్తు చేసుకుంటున్నారు.

**హామీలు అమలు చేయడం లేదని భారాస**

ప్రతిపక్ష భారాస ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో బలమైన క్యాడర్‌ను కలిగి ఉంది. మాజీ మంత్రి హరీశ్‌రావు నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక కార్యక్రమాలపై నిరసన కార్యక్రమాలు చేపడుతూ ముందుకు సాగుతున్నారు. ఇటీవల సంగారెడ్డి జిల్లా జిన్నారంలో పటాన్‌చెరు నియోజకవర్గంలోని నాలుగు మండలాల కర్షకులకు రైతుభరోసా కోసం మహాధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకుంటూ.. కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీలు సక్రమంగా అమలు చేయడం లేదంటూ ప్రజల్లోకి తీసుకెళ్లాలని దిశానిర్దేశం చేస్తున్నారు.

**మెజార్టీ స్థానాల్లో గెలుపే లక్ష్యంగా కాంగ్రెస్**

రానున్న స్థానిక ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకోవడానికి



అధికార కాంగ్రెస్ పార్టీ సమాయత్తమవుతోంది. ఉమ్మడి జిల్లాలోని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఇప్పటికే నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితి, సంక్షేమ పథకాల అమలు తదితర అంశాలపై నేతలు, పార్టీ కార్యకర్తల నుంచి అంతర్గతంగా సమాచారాన్ని సేకరిస్తున్నారు. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలతో పాటు ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలున్న చోట మండలాల వారీగా పూర్తయిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్నారు. ఇటీవలే ఉమ్మడి జిల్లాకు ఇన్‌ఛార్జి మంత్రిగా నియమితులైన వివేక్ వెంకటస్వామి ఉమ్మడి జిల్లాలోని పదకొండు నియోజకవర్గాల్లో పార్టీ పరిస్థితిపై నిఘా వర్గాల ద్వారా సమగ్ర సమాచారం తెప్పించుకున్నట్లు తెలుస్తోంది. పార్టీ బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని నిర్ణయించారు.

**పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి**

గ్రామీణ ప్రాంతాల్లో పట్టున్న ప్రాంతాలపై భాజపా దృష్టి సారించింది. గతంలో పలు ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు సాధించిన దుబ్బాక నియోజకవర్గంతో పాటు లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, భారాసల కంటే అధిక ఓట్లు సాధించిన ప్రాంతాల్లో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఉమ్మడి జిల్లాలోని అన్ని స్థానాల్లో పోటీచేసేందుకు భాజపా సమాయత్తమవుతోంది. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు స్థానిక ఎన్నికల్లో పట్టు సాధించేందుకు అవసరమైన వ్యూహాలు రచిస్తున్నారు. జిల్లా పార్టీ అధ్యక్షులు నియోజకవర్గాల వారీగా కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నారు.

# పరమ పవిత్రం... శ్రావణ మాసం



చైత్రాది మాస గణనలో శ్రావణం, అయిదవది ఉత్కృష్టమైనది. విష్ణుమూర్తి జన్మ నక్షత్రం శ్రవణ నక్షత్రం. ఈ నక్షత్ర యుక్త పూర్ణిమ కలది కావటం చేత ఈ మాసానికి శ్రవణము అనే పేరు వచ్చింది. శ్రీకృష్ణ భగవానుడు పుట్టిన మాసమిది హయగ్రీవ ఉత్పత్తి కూడా ఈ మాసంలోనే. గరుడుడు అమృత భాండాన్ని ఈ మాసంలోనే సాధించాడు. “వాగర్థావివ సంపృక్తౌ వాగర్థ ప్రతిపత్తయే, జగత: పితరం వందే పార్వతీ పరమేశ్వరం “అని మహాకవి కాళిదాసు వాగర్థముల జ్ఞానానికై పార్వతీ పరమేశ్వరులను ప్రార్థించాడు. వాగర్థములవలె కూడియున్న పార్వతీ పరమేశ్వరులు జగజ్జననీ జనకులు. ఈశానాం సర్వ విజ్ఞానం. ఎల్లవిద్యలకు ఈశ్వరుడు పార్వతీ పతియే. అందుకే వేదం ‘ప్రథమో దైవ్యో భిషక్’ అని స్తుతిస్తున్నది. “అంత్యజో విధిమోనిపివా మూరో?వా, పండితోవా, పంచాక్షరీం జపేన్నిష్టో ముచ్యతే పాప పంజరాత్ “ అని శివపురాణం తెలుపుతున్నది. పూజా సంస్కారాలు తెలియని వారునూ, వేదం తెలియని వారైననూ, మూరు?లూ, పండితులూ ఎవరైననూ, ఓం నమఃశివాయ అని పంచాక్షరీ జపం పఠిస్తే, సర్వపాపాలూ, కష్టాలూ, దు:ఖాలూ పటాపంచల వుతాయని శివపురాణం స్పష్టం చేస్తున్నది. “నభోమాసేతుయో మర్త్య: లింగం శైవం సమర్చయేత్, పశ్యేద్యా పూజితం దేవం, సాయుజ్యం సోనిధి గచ్ఛతి”. లోకేశ్వరుడు, అభయంకరుడైన శంకరుని శ్రావణమాసం అందునా ప్రత్యేకించి, సోమవారం మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో పూజిస్తే శివసాయుజ్యం పొందగలని పురాణాలు విశదీకరిస్తున్నాయి. న్యాసము అనగా ఐక్యము చేసుకోవడం. పూజకు పూర్వం రుద్రుడిని, లింగంలో నిలుపుకుని, తాను రుద్రుడై, ఆ రుద్రుడిని అభిషే కించాలి. అందులకై మహన్యాస పూర్వక రుద్రాభిషేకంతో, కనీసం శ్రావణ సోమ వారమైనా శివుని పూజించి, నిరాహారం, ఉపవాసం లేక ఏకభుక్తం చేయాలి. చంద్రమా మనసో జాతః అంటే చంద్రుడు మనస్సుకు కారకుడు. శివుడి తలపైన నెలవంక ఉంటుంది. సోమవారాలు చంద్రునికి సంబంధించిన పాలు, బియ్యం, తెల్లని వస్త్రాలు దానం చేయడం వల్ల చిత్త చాంచల్యం నుంచి బయట పడ గలుగుతారు. మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. బుద్ధిలో విశ్లేణశక్తి పెరుగు తుంది. “సోమవారం వ్రతం కార్యం, శ్రావణీవై యధావిధి, శక్తేన్ పోషణం కార్యం, అథవా నిశి భోజనం”. “సోమవారే చతుర్దశ్యాం, కృష్ణపక్షే విశేషిత:, శ్రావణే పూజయేర్లింగం, శ్రేయోర్థ” రాఘవార్చితం”. ద్వాదశ మాసాల్లో శ్రావణం అత్యంత శ్రేష్ఠమైన పవిత్ర మాసం. వేసవి తాపంతోనున్న జీవకోటికి వర్షాలతో సేద తీరి ప్రాణం లేచి వస్తుంది. పాడి పంటలు, కూరగాయలు సమృద్ధియై పుష్పాలు, వృక్షాలు పచ్చదనంతో కళకళలాడుతూ, వింతశోభలు కూర్చుకుంటాయి. ఈకాలంలో. పూజాక్రతువులకు, దానధర్మాలకు, దాతలకు, భోక్తలకు అనువైన మాసమిది. సృష్టి, స్థితి, లయకారులైన జగజ్జననీ జనకులు పార్వతీ పరమేశ్వరులు ఈపరమపవిత్ర మాసంలోనే సృష్టికార్యాన్ని ప్రారంభించారని పెద్దల ఉవాచ. మానవ దంపతులుకూడా శ్రావణ మాసాన్ని శుభ దినాలుగా ఎంచుకుంటారు. అంతేగాక శ్రావణ మాసంలో, హిందూ పండుగలు అధికంగా ఉంటాయి. వారానికి ఉన్న ఏడు రోజులలో మాఘ మాసంలో ఆదివారాలు, కార్తీకమాసంలో సోమవారాలు, మార్గశిర మాసంలో లక్ష్మీ వారాలు మహిమాన్వితాలుగా ఉన్నాయి. ఆది, సోమ లక్ష్మీ వారాలు పోతే, ఇక మిగిలిన నాలుగు వారాల్లో మూడు వారాలు ఒక్క శ్రావణ మాసంలోనే మహత్తు కలవిగా ఎంచ బడుతున్నాయి. శ్రావణ మాసంలో శని వారాలు, మంగళ వారాలు, శుక్ర వారాలు ఎక్కువ నియమ నిష్టలను కోరేవిగా ఉన్నాయి. శ్రావణ సోమవారం శివారాధన, శ్రావణ మంగళవారం – గౌరీ పూజ, శుక్రవారం – వరలక్ష్మీ వ్రతం, శనివారం – విష్ణు పూజ, నాగుల చవితి, నాగపంచమి, గరుడ పంచమి, శ్రీకృష్ణ జన్మాష్టమి, పుత్రదైకాదశి, ఉపాకర్మ (యజ్ఞోపవీత ధారణం), రాఖీ పండుగ, హయగ్రీవ జయంతి, అజైకాదశి, పోలాల అమావాస్య, మొదలగు పండుగలు ఉండే శ్రావణమాసం లక్ష్మీపార్వతులకేగాక, హిందువులకు అత్యంత ఇష్టదాయకం. ప్రధానంగా ఈ మాసంలో మహిళలకు వరలక్ష్మీ వ్రతం, నూతన వివాహిత యువతులకు మంగళ గౌరీ వ్రతం ఆచరించే సాంప్రదాయం ఉంది. శ్రావణం దేవుడికి, భక్తుడికి అనుసంధానం కావించే మాసం. జలప్రియుడైన గంగాధరునికి దోసెడు నీటితో అభిషేకించి, పిడికెడు భస్మం పూసి, ఒకే ఒక్క మారేడు పత్రం సమర్పించి, కైమోడ్పులిడితే సంతుష్టుడై సర్వ భోగాలను సమకూర్చగలడని ప్రతీతి. బోలా శంకరుడు జల (గంగా) ప్రియుడు. ఈ నెల శుక్ర వారంతో శ్రావణ మాసారంభం కానుండగా, నెల రోజులపాటు వివిధ ఆలయాలలో, శివ పంచాయతనాలలో, ప్రత్యేక ధార్మిక కార్యక్రమాలు నిర్వ హించ నున్నారు. శివాలయాలలో అనునిత్యం మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, సకృతావర్తన రుద్రాభిషేకాలు అష్టోత్తరాలు, లలిత సహస్రనామాలు పారాయణ కార్యక్రమాలను నిర్వహించ నున్నారు. శ్రావణ, భాద్రపద మాసాలు వర్షాకాలం. ఈ కాలంలో వర్షాలు పడతాయి. అన్ని రకాల ఆహార పదార్థాలు తినకుండా జాగ్రత్త వహించాలి. శరీరంలో వేడి పుట్టించే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి.

## భూనిర్వాసితులు.. పరిహారానికి ఎదురుచూపులు

రామడుగు: గోదావరి నదీ జలాల ఎత్తిపోతల మూడో టీఎంసీ కాలువ కోసం చేపట్టిన భూసేకరణలో పరిహారం కోసం రామడుగు, గంగాధర మండలాల రైతులు ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో కీలకమైన మూడో టీఎంసీ కాలువ నిర్మాణం పనులు రెండేళ్లుగా ఆగిపోయాయి. భూపరిహారం కూడా నిలిచిపోవడంతో అన్నదాతలు భూములు కోల్పోయి, పంటలు సాగు చేసుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలంలో శ్రీపాద సాగర్ ఎల్లంపల్లి ప్రాజెక్టు బ్యాక్ వాటర్ అంతర్గత పైపులైన్లతో నీటిని ఎత్తిపోసి పెగడపల్లి మండలం దీకొండ, నామాపూర్ పంప్‌హౌస్‌ల ద్వారా రామడుగు మండలం తిర్మలాపూర్ నుంచి ఉపరితల ప్రవాహానికి నీరందించడానికి ప్రణాళిక రూపొందించారు. కాళేశ్వరం ప్రాజెక్టు ఎత్తిపోతల సామర్థ్యం రెండు టీఎంసీలు కాగా తదనంతరం చేపట్టిన ఎత్తిపోతలను మూడో టీఎంసీ కాలువగా అప్పటి ప్రభుత్వం ప్రకటించింది. ఎత్తిపోతల నిర్వహణ వ్యయం కాళేశ్వరం ప్రాజెక్టుతో పోల్చితే తక్కువ కావడంతో మూడో టీఎంసీ కాలువ ప్రాధాన్యం సంతరించుకుంది.



**రూ.136 కోట్లు చెల్లించాలి**

కరీంనగర్ జిల్లా రామడుగు, తిర్మలాపూర్, శ్రీరాములపల్లి, షానగర్, కిష్టాపూర్, గంగాధర మండలం కొండన్నపల్లి, కురిక్యాల, తాడిజెర్రి, ఆచంపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం విలాసాగర్, మర్లపేట, దేశాయిపల్లి, రత్నంపేట, వరదవెల్లి గ్రామాల మీదుగా ఉపరితల కాలువ తవ్వకం చేపట్టారు. బోయినపల్లి మండలంలోని ఐదు గ్రామాల్లో చేపట్టిన 165 ఎకరాల భూసేకరణకు పరిహారం చెల్లించారు. రామడుగు, గంగాధర మండలాల్లోని 12 రెవెన్యూ గ్రామాల్లో సేకరించిన 446 ఎకరాలకు సగం పరిహారం చెల్లించి అర్ధంతరంగా నిలిపివేశారు. మొత్తం పరిహారం రూ.269 కోట్లలో రూ.115 కోట్లు మాత్రమే నిర్వాసితులకు చెల్లించారు. రూ.136 కోట్ల చెల్లింపులు నిలిచిపోవడంతో రెండు మండలాల రైతులు కార్యాలయాల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్నారు. దీంతోపాటు షానగర్, కిష్టాపూర్, కొండన్నపల్లి గ్రామాల్లో ఇళ్లు కోల్పోతున్న వారికి పునరావాసం కల్పించాల్సి ఉంది. పరిహారం చెల్లించకపోవడంతో ఆర్థికంగా నష్టపోతున్నామని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ప్రభుత్వం స్పందించి వెంటనే పరిహారం చెల్లించాలని కోరుతున్నారు.

## అర్ధంతరంగా మానేసినా.. దూరవిద్య భరోసా




కరీంనగర్ : వివిధ రకాల సమస్యలు, అడ్డంకులతో ఉన్నత చదువులకు దూరమైన వారికి దూరవిద్య గొప్ప అవకాశం కల్పిస్తోంది. ఆర్థిక స్థోమత సరిగాలేని వారు.. కుటుంబ పరిస్థితులు అనుకూలించని విద్యార్థులు... విద్యార్హతలు లేక పదోన్నతులు పొందని నాలుగో తరగతి ఉద్యోగులు... ఇలా ఉన్నత విద్య లేక చింతిస్తున్న వారి కోసం దూర విద్యా కేంద్రాలు అందుబాటులో ఉన్నాయి. ఈ అధ్యయన కేంద్రాల్లో డిగ్రీ, పీజీలో ప్రవేశాలు పొంది ఉన్నత చదువుల కలలను సాకారం చేసుకోవచ్చు.

**రెగ్యులర్ డిగ్రీతో సమానం**

దూర విద్యా విధానంలో పొందిన డిగ్రీ, పీజీలను విద్య, ఉద్యోగ తదితర ఏ రంగంలోనైనా రెగ్యులర్ డిగ్రీలతో సమానంగా చూస్తారు. ఇంటర్ సమాన విద్యార్హతలు కలిగిన వారు డిగ్రీ కోర్సులో ప్రవేశానికి, డిగ్రీ పూర్తి చేసిన వారు పీజీలో దరఖాస్తు చేసుకునే అవకాశముంది. ప్రస్తుతం డిగ్రీ కోర్సుల్లో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ అందుబాటులో ఉన్నాయి.

**దరఖాస్తు విధానం..** దూర విద్యా విధానంలో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందడానికి గత నెల 13 నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తుల నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. ఆగస్టు 13 వరకు గడువు ఉంది.

ఇంటర్మీడియెట్, పాలిటెక్నిక్, ఐటీఐ ఉత్తీర్ణులైన వారు డిగ్రీ చేయడానికి అర్హులు. వీరికి ఏడాదికి రూ.3200 ఫీజు ఉంటుంది. పీజీలో ప్రవేశానికి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. విద్యార్హత పత్రాలు, కుల ధ్రువీకరణ, ఆధార్‌కార్డు, జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేసుకోవాలి. ఏడాదికి రూ.15,300 రుసుం చెల్లించాల్సి ఉంటుంది. చదువుకోవడానికి కావాల్సిన పుస్తకాలను ఇంటికే పంపిస్తారు.

ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న తరువాత ఎంచుకున్న కేంద్రంలో రెండు కాపీలను సమర్పించాలి. మెట్‌పల్లి, మంథని, హుజూరాబాద్, పెద్దపల్లి, గోదావరిఖని, జగిత్యాల, అగ్రహారం, జమ్మికుంట, గంభీరావుపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కరీంనగర్ మహిళా డిగ్రీ కళాశాలల్లో కరీంనగర్ అంబేడ్కర్ సార్వత్రిక డిగ్రీ, పీజీ కళాశాల పరిధిలోని డిగ్రీ అధ్యయన కేంద్రాలు ఉన్నాయి.

**డిగ్రీ పూర్తి చేసి.. పదోన్నతి పొంది**

చిల్వకోడూరు మండల ప్రజా పరిషత్తు పాఠశాలలో నాలుగో తరగతి ఉద్యోగిగా విధులు నిర్వర్తిస్తూనే సెలవు రోజుల్లో కరీంనగర్ ఎస్సారార్ కళాశాల ఆవరణలోని ఓపెన్ వర్సిటీ కేంద్రంలో డిగ్రీ పూర్తి చేశాను. అనంతరం జూనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందాను.

– ఎండీ.తాజొద్దిన్, చందోలి, గొల్లపల్లి మండలం

**మంచి అవకాశం**చదువు మధ్యలో ఆపేసిన వారికి దూర విద్య కేంద్రాలు మంచి అవకాశా న్ని అందిస్తున్నాయి. ఇక్కడ పొందే డిగ్రీని అన్ని యూనివర్సిటీల్లో రెగ్యులరో విద్యతో సమానంగా పరిగణిస్తారు. ఇక్కడ చదువుకున్న పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులుగా స్థిరపడ్డారు.– డాక్టర్ కల్వకుంట రామకృష్ణ, డా.బి.ఆర్.అంబేద్కర్ ప్రాంతీయ సమన్వయ కేంద్రం అధికారి, కరీంనగర్

## పొగ కష్టాలకు చెక్..!

కొణిజర్ల : ప్రభుత్వ బడుల్లో ఇప్పటి వరకు మధ్యాహ్న భోజనం కట్టెల పొయ్యి మీద, పొగ మధ్య తయారయ్యేది. ఇక నుంచి ఆ కష్టాలు తీరనున్నాయి. ప్రభుత్వం భోజనం వండేందుకు గ్యాస్ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించింది. ఆగస్టు 15లోగా జిల్లాలోని అన్ని పాఠశాలల్లో గ్యాస్ కనెక్షన్ల ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశాలు వెలువరించింది. ఈ పథకం అమలుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు సమకూర్చుతున్నాయి. ఈ విధానంతో భోజన తయారీలో ఆలస్యం, పొగచూరడం, ఇతరత్రా సమస్యలు తలెత్తే అవకాశం ఉండదు.

**పాఠశాలలన్నింటికీ కనెక్షన్లు**

ఇటీవల ప్రభుత్వం అన్ని పాఠశాలలకు నాణ్యమైన వంటపాత్రలు అందించింది. గ్యాస్ కనెక్షన్లు ఇస్తుండటంతో విద్యార్థులకు శుభ్రమైన భోజనం అందించాలని విద్యాశాఖ భావిస్తోంది. ఆయా మండలాల పరిధిలో స్థానిక ఏజెన్సీల ద్వారా గ్యాస్ సరఫరా చేసేలా అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. వంట కార్మికులకు గ్యాస్ సిలిండర్, స్టౌ ఉచితంగా అందిస్తుండగా గ్యాస్ మాత్రం కార్మికులే నింపుకోవాలి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 1,316 పాఠశాలల్లో కట్టెల పొయ్యి మీద వండుతున్నట్లుగా గుర్తించి కనెక్షన్లు మంజూరు చేసింది. ఖమ్మం జిల్లాలో 1,189 పాఠశాలలకుగానూ ఇప్పటికే 53 పాఠశాలలకు కనెక్షన్లు ఉన్నట్లుగా గుర్తించారు. మిగతా 1,136 పాఠశాలలకు



అందించనున్నారు.

**కేంద్ర బృందం పరిశీలించి..**

గత నెలలో ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును కేంద్ర బృందం పరిశీలించింది. కట్టెల పొయ్యితో భోజనం తయారీ వల్ల మహిళా కార్మికులు పడుతున్న బాధలను చూసింది. పొగ వల్ల కార్మికులకే కాకుండా విద్యార్థులకు శ్వాసకోశ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని గ్రహించి ప్రభుత్వాలకు సూచించగా అమలుకు శ్రీకారం చుట్టారు. గ్యాస్ కనెక్షన్లతో భారంగా మారే అవకాశం ఉందని, రాయితీ కింద గ్యాస్ ఇవ్వాలని మహిళలు కోరుతున్నారు .ప్రభుత్వం గ్యాస్ కనెక్షన్లను పాఠశాలలకు అందిస్తోంది. అన్ని మండలాలకు ఉత్తర్వులు అందాయి. గ్యాస్ పొయ్యి, స్టౌ మాత్రమే సర్కారు ఇస్తుంది. అబ్రహం, ఎంఈఓ

## దాణా.. ధరల మాయాజాలం



సిరిసిల్ల: రాజన్న గోశాలకు సరఫరా అవుతున్న దాణా ధరలో మాయాజాలం వెలుగులోకి వచ్చింది. టెండర్లు నిర్వహించినప్పుడు గుత్తేదారులు పోటీపడి బహిరంగ మార్కెట్లోని ధరకు తక్కువగానో.. అంతకు సమానంగానో కోడ్ చేస్తారు. రెండింతలు ఎక్కువ చూపిన వారికి హక్కులు దక్కడం గమనార్హం. ఈ వ్యవహారం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లింది. ఆలయంలో జరిగే నిత్యపూజలు, ప్రసాదాల తయారీకి గుడిచెరువు కట్టపైన ఉన్న గోశాలలోని ఆవుల నుంచి నిత్యం పాలు సేకరిస్తారు. వీటికి అందించే పచ్చిదాణాను రెండేళ్లకోసారి టెండర్ నిర్వహించి కొనుగోలు చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఇటీవల తిప్పాపూర్ గోశాలలో అనారోగ్యంతో మృత్యువాత పడ్డవి మేత అందక బలహీన పడి చనిపోయినవే. అనారోగ్యంతో ఉన్నవాటికి చికిత్సలందించే సమయంలో పచ్చిదాణా ఇవ్వడంతో చాలా వరకు కోలుకున్నాయి. దీంతో పచ్చిదాణా ఎక్కువ మొత్తంలో అవసరమని పశువైద్యాధికారులు ఉన్నతాధికారులకు సూచించారు. ఇప్పటికే సరఫరా చేస్తున్న గుత్తేదారు నుంచే సేకరించారు. అదనపు దానాను సరఫరాకు బిల్లులు చెల్లించాలని ఇటీవల గుత్తేదారు అధికారులను సంప్రదించారు.

**ఏటా రూ.కోట్లు పక్కదారి**గోశాలలో వసతుల కల్పన, కోడెల చికిత్సలన్నీ కలెక్టర్ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. దీంతో ఈ బిల్లును గోశాల అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. పచ్చిదానా కిలో రూ.40 ఉండటంపై అనుమానం వచ్చి పశువైద్యాధికారులతో దాణా ధరలపై ఆరా తీయించారు. సాధారణ పచ్చిగడ్డి కిలో రూ.2.10లు కాగా పిల్లిపెసర, బబ్బెరతో కూడిన పచ్చి దాణాకు కిలో రూ.8 నుంచి గరిష్ఠంగా రూ.15 వరకు ఉంటుందని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతోపాటు టెండరు దస్త్రాలను సైతం పరిశీలించారు. గుత్తేదారు కోడ్‌చేసిన ధరనే కమిటీ సభ్యులు, టెక్నికల్ బృందం ఆమోదించడంపైనా పలు అనుమానాలు ఉన్నాయి. గోశాలకు సరఫరా అవుతున్న పచ్చిదాణాకు ఏటా రూ.కోటికిపైనే గుత్తేదారుకు చెల్లిస్తుండటం గమనార్హం. ఏళ్ల తరబడి జరుగుతున్న ఈ వ్యవహారంలో కోట్ల రూపాయల స్వామివారి ఆదాయం పక్కదారి పడుతోంది. గతేడాది ఆలయంలోని పలు విభాగాల్లో అక్రమాలపై ఏసీబీ అధికారులు విచారణ జరిపారు. వీటిపై ఆయా విభాగాల్లోని అధికారులకు ఇప్పటికీ రెండు సార్లు నోటీసులు కూడా జారీచేశారు. తాజాగా పచ్చి దానా వ్యవహారంపైనా లోతుగా విజిలెన్స్ విచారణ జరిపిస్తే మరిన్ని అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంటుంది.

**సొంతంగా సాగు..**

గోశాల నిర్వహణ.. అందులో జరుగుతున్న అక్రమాలకు అడ్డుకట్టవేయడంతోపాటు కోడెల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించారు. దీనికోసం ఇటీవల సిబ్బందిని నియమించారు. వేములవాడ మండలం మర్రిపల్లి శివారులో 67 ఎకరాల రెవెన్యూ స్థలాన్ని సేకరించారు. దీనిలో 40 ఎకరాల్లో అధునాతన వసతులతో గోశాల నిర్మాణం, 27 ఎకరాల్లో పచ్చిగడ్డి, దాణా పెంపకానికి కేటాయిస్తున్నారు. ఎత్తుపల్లాలు, ముళ్లపొదలతో ఉన్న ఈ స్థలాన్ని చదును చేసి, సాగుకు అనుకూలంగా మార్చేందుకు వ్యవసాయ, డీఆర్‌డీఏ, పశుసంవర్ధకశాఖలు సంయుక్తంగా ప్రణాళికలు చేస్తున్నాయి.

## ‘వర్షా’తిరేకాలు

ఖమ్మం : కొద్దిరోజులుగా వర్షాలు కురవక.. అధిక ఎండల తీవ్రతతో పత్తి, పెసర మొక్కలు వాడిపోయాయి. వరినార్లు పోసుకున్న అన్నదాతలు.. నాట్లు వేసేందుకు వానలు ఎప్పుడు కురుస్తాయా అని ఎదురుచూశారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలు ప్రధానంగా పత్తి, పెసర, మినుము పంటలకు జీవం పోశాయి. అదనుకు వరుణుడు కరుణించటంతో రైతులు ఆనందం వ్యక్తంచేస్తున్నారు. సాగర్ ఆయకట్టుకు నీటి విడుదల కొనసాగుతుండటంతో సాగు సందడి నెలకొంది.

**వరిపై చిగురించిన ఆశలు**

జిల్లాలో ప్రధాన పంట వరి. ఎన్నెస్పీ ఆయకట్టు పరిధిలోనే ఏటా 2.55 లక్షల ఎకరాల్లో ఈ పంటను పండిస్తారు. వర్షాలు సకాలంలో కురవకపోవడంతో అన్నదాతలు ఆందోళన చెందారు. ఇప్పటివరకు బోర్లు, బావుల కింద నాట్లు వేశారు. సాగర్‌కు శ్రీశైలం నుంచి వరద నీరు వస్తుండటంతో పాలేరుకు 2,818 క్యూసెక్కుల నీటిని వదిలారు. ఈ జలాలు తెల్లవారుజాము వరకు పాలేరుకు చేరుకోనున్నాయి. ప్రస్తుతం పాలేరు జలాశయంలో నీటిమట్టం 14.50 అడుగులకు చేరింది. ఈనెల 14న ఎడమ కాల్వకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి నీటిని విడుదల చేసిన విషయం విదితమే. అప్పటి నుంచి ఆయకట్టులో సాగుకళ కనిపిస్తోంది.

మొత్తంగా జిల్లాలో ఇప్పటివరకు 52,378 ఎకరాల్లో అన్నదాతలు వరినాట్లు వేశారు. 45,909 ఎకరాల్లో వెదజల్లే పద్ధతిని అవలంబించారు. మరో 1,00,765 ఎకరాలకు సంబంధించి వరినార్లు పోసుకొని సిద్ధంగా ఉన్నారు.

**చింతకానిలో భారీ వర్షం**



జిల్లాలో ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం 8.30 గంటల వరకు 110.4 (సగటున 5.30) మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరుమలాయపాలెంలో 16.4, కూసుమంచి- 33.80, ముదిగొండ- 4.20, ఖమ్మం అర్బన్-5.40, బోనకల్లు-1.20, మధిర- 45.60, ఎర్రుపాలెంలో 3.80 మి.మీ. వర్షం కురిసింది. జిల్లాలోని వివిధ మండలాల్లో సోమవారం జోరుగా వానలు పడ్డాయి. ఖమ్మం నగరం, చింతకాని, మధిర, వైరాలో గంటన్నర పాటు ఏకధాటిగా వర్షం కురిసింది. జిల్లాకేంద్రంలోని పాతబస్టాండు పరిసరాల్లో రహదారిపై మురుగునీరు ఉద్ధృతంగా పారటంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సాయంత్రం వరకు చింతకానిలో 61.80 మి.మీ, మధిర 49.50, కూసుమంచి- 47, ఖమ్మం అర్బన్- 46.80, ముదిగొండ- 44.80, కొణిజర్ల(పెద్దగోపతి)- 46.5, బోనకల్(రావినూతల)- 45.30, చింతకాని(నాగులవంచ)- 36.80, రఘునాథపాలెం(వీవీపాలెం)- 31.50, సత్తుపల్లి- 29, వైరా- 36.3, పెనుబల్లి- 33.50, వేంసూరు- 23.80, ఖమ్మం రూరల్(పాలెగూడెం)- 18, ఎర్రుపాలెం- 31.3, నేలకొండపల్లి- 22, తిరుమలాయపాలెంలో 25.50 మి.మీ. వర్షపాతం నమోదైంది. జిల్లాలో సాధారణ వర్షపాతం 157.8 మిల్లీమీటర్లు కాగా.. వరకు 128.8 మి.మీ. వర్షం కురిసినట్లు అధికారులు వెల్లడించారు.

## అతివల అక్షరాస్యతకు ఉల్లాస్



చొప్పదండి: గ్రామీణ ప్రాంతాల్లో చదవడం, రాయడం రాని వృద్ధులు, మహిళలను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉల్లాస్ (అండర్ స్టాండింగ్ ఆఫ్ లైఫ్‌లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ) అనే పథకానికి శ్రీకారం చుట్టాయి. అతివల్లో ముఖ్యంగా మహిళా స్వయం సహాయక సంఘాల్లో ఉన్న నిరక్షరాస్యులను గుర్తిస్తున్నారు. జిల్లా విద్యాశాఖ, డీఆర్డీవో అధికారులు ఈ కార్యక్రమాన్ని సంయుక్తంగా నిర్వహిస్తున్నారు.

**లక్ష్యం 37 వేల మంది..** జిల్లాలోని స్వయం సహాయక సంఘాల్లోని సభ్యుల్లో 37 వేల మందికి ఈ పథకం ద్వారా చదవడం, రాయడం నేర్పించడం లక్ష్యంగా నిర్దేశించారు. దీనిలో భాగంగానే క్షేత్రస్థాయిలో వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. వీరి సమక్షంలో నిరక్షరాస్యులైన మహిళలను గుర్తించే ప్రక్రియ ఇప్పటికే 90 శాతం పూర్తయింది. ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను కూడా దీని కోసం తీసుకొచ్చింది. అప్పటివరకు చదివిన తరగతుల వారీగా యాప్‌లో పొందుపరుస్తారు. పదో తరగతిలోపు మానేసిన వారికి సార్వత్రిక పదోతరగతి పాసైన వారికి సార్వత్రిక ఇంటర్ పూర్తి చేసేలా ప్రోత్సహిస్తారు. ఇంటర్ పూర్తయిన వారుంటే డిగ్రీ చేసేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. పూర్తిగా నిరక్షరాస్యులు ఉంటే చదువు వచ్చిన వారిని వాలంటీరుగా నియమించి అక్షరాలు నేర్పిస్తారు. తద్వారా మహిళా సంఘాల సభ్యుల్లో పూర్తిగా అక్షరాస్యత పెరిగి భవిష్యత్తులో ఉపాధి అవకాశాలు పొందేలా చర్యలు తీసుకుంటున్నారు.

**నిర్వహణ కమిటీ..**

గ్రామస్థాయిలో పథకం వేగవంతంగా నిర్వహించేందుకు జిల్లా పాలనాధికారి ఆధ్వర్యంలో కమిటీలు ఏర్పాటు చేయనున్నారు. అందులో డీఆర్డీవోతోపాటు విద్యాశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తారు. మండల స్థాయిలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ ఏపీఎం అలాగే గ్రామస్థాయిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు, వీవోఏ అధ్యక్షురాలు, కార్యదర్శి బాధ్యతలు నిర్వర్తించనున్నారు.

**లక్ష్యం చేరేలా చర్యలు..**

జిల్లాలో నిర్దేశించుకున్న లక్ష్యం చేరేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. దానికి అనుగుణంగా నిరక్ష్యరాస్యులకు చదువు చేప్పేలా ప్రణాళికలు సిద్ధం చేశాం. విద్యాశాఖ, డీఆర్డీవో సంయుక్తంగా పనిచేసి లక్ష్యాన్ని చేరుకుంటాం. జిల్లాలో అక్షరాస్యతను పెంచడానికి కృషి చేస్తాం.

– శ్రీధర్, డీఆర్డీవో కరీంనగర్

## నజరానా ఊరిస్తున్నా.. నామమాత్రంగా స్పందన

కొత్తగూడెం: పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు పీఎం సూర్యఘర్, ముఫ్త్ బిజిలీ యోజనలో భాగంగా చేపట్టిన ‘మోడల్ సోలార్ విలేజ్’ పథకం ఆశించిన ఫలితాలివ్వటం లేదు. సౌర విద్యుత్తు వినియోగంలో ఆదర్శంగా నిలిచిన గ్రామాలకు కేంద్ర ప్రభుత్వం రూ.కోటి నజరానా ప్రకటించినా.. ఆసక్తి అంతంతమాత్రంగానే ఉంది. ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 5వేల కంటే ఎక్కువ జనాభా కలిగిన 22 గ్రామాలు ఎంపికైనా సౌరపలకలు అమర్చేందుకు ప్రజల నుంచి స్పందన కొరవడింది. ఖమ్మం జిల్లాలో ఏప్రిల్ 4న పోటీలు మొదలవగా.. అక్టోబరు 3 వరకు కొనసాగనున్నాయి. ఎంపికైన ఎనిమిది గ్రామాల్లో 17 యూనిట్లతో తల్లాడ ప్రథమ స్థానంలో ఉండగా.. నేలకొండపల్లి (4), కందుకూరు(2), అన్నారుగూడెం(2) రెండో స్థానంలో నిలిచాయి. మిగిలిన గ్రామాల్లో సౌరపలకలు అమర్చలేదు.

**ఇదీ సంగతి..**

200 యూనిట్లలోపు వినియోగదారులకు రాష్ట్ర ప్రభుత్వం ఉచితంగా విద్యుత్తు అందిస్తుండటం ‘మోడల్ సోలార్ విలేజ్’ పథకానికి ప్రతిబంధకంగా మారింది. గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 80శాతం వినియోగదారులు 200 యూనిట్లలోపే విద్యుత్తును వాడుతుండటంతో సౌరపలకల ఏర్పాటుకు వారు ఆసక్తి కనబరచటం లేదు.

వ్యాపార సముదాయాల నిర్వాహకులు, 200 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్తు వినియోగించేవారు ముందుకొచ్చినా.. సిబిల్ స్కోర్ అవరోధంగా మారుతోంది.

మూడు కిలోవాట్ల సోలార్ రూఫ్‌టాప్ ఏర్పాటుకు రూ.1.45లక్షలు ఖర్చయితే అందులో కేంద్రం గరిష్ఠంగా రూ.78వేలు రాయితీ ఇస్తుంది. మిగిలిన మొత్తాన్ని వినియోగదారు చెల్లించాలి. ఇది గ్రామీణ ప్రాంతాల్లో సమస్యగా మారుతోంది. 5వేల జనాభాను ప్రాతిపదికగా తీసుకోవటంతో మండల కేంద్రాలు, పట్టణాలతో పోటీ పడలేమని గ్రామాలు చేతులెత్తేశాయి. 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, సిబిల్ స్కోర్ వంటి కారణాల వల్ల ఆశించిన స్థాయిలో సౌరపలకలను అమర్చటం లేదు. కొన్ని గ్రామాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. పోటీకాలం ముగిశాక ఎక్కడ ఎన్ని యూనిట్లు ఏర్పాటు చేశారనేది స్పష్టమవుతుంది. అజయ్‌కుమార్, టీజీ రెడ్కో మేనేజర్

## యూనివర్సిటీ.. కోరేది ఇదే..!

పాల్వంచలోని మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీ ఆఫ్ తెలంగాణ (ఎంఈఎస్‌యూటీ)లో అరకొర వసతులతో విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడుతున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇన్‌ఛార్జి వైస్ ఛాన్సలర్(వీసీ) యోగితారాణా, సాంకేతిక విద్య కార్యదర్శి దేవసేన ఈనెల 23న ఇక్కడికి రానున్న నేపథ్యంలో ప్రభుత్వం, అధికారులు దృష్టి సారించాల్సిన అంశాలపై కథనం.

**రూ.500 కోట్లు అవసరం..**

యూనివర్సిటీకి 312 ఎకరాల విశాల స్థలం కలదు. దీని చుట్టూ ప్రహరీ నిర్మించాలి. ప్రస్తుతం బాలికలకు 150 మంది సామర్థ్యంతో వసతిగృహం కొనసాగుతోంది. ఇందులో సుమారు 250 మంది బాలికలు సర్దుకుపోతున్నారు. 250 మంది సామర్థ్యం గల వసతిగృహంలో 380 మంది బాలురు ఉంటున్నారు. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా 1,500 మంది బాలురు, 500 మంది బాలికలు ఉండేలా వేర్వేరుగా వసతిగృహాలు నిర్మించాలి. అకాడమిక్ బ్లాక్‌లు పది అవసరం. రెండు బస్సులు సమకూర్చాలి. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్స్, స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఆడిటోరియం, ప్రవేశ ద్వారం, కొత్త కోర్సులకు అనుగుణంగా 200 మంది బోధన, 400 మంది బోధనేతర సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించాలి. విశ్వవిద్యాలయం కావటంతో అతిథిగృహం, పరీక్షల విభాగం, సెంట్రల్ లైబ్రరీ, అంతర్గత రోడ్లు, ఆరోగ్య కేంద్రం, విద్యుత్తు, తపాలా తదితర సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. మొత్తమ్మీద వీటి నిర్మాణాలకు రూ.500కోట్లు అవసరమని విశ్వవిద్యాలయ అధికారులు అంచనా వేస్తున్నారు.

కొత్త కోర్సులు మంజూరు సీఎస్ఈ, ఈఈఈ, మైనింగ్, ఈసీఈ, ఐటీ కోర్సులతో ఇంజినీరింగ్ విద్యనందిస్తున్నారు. ఈ విద్యాసంవత్సరం నుంచి జియోలాజీ, ఎన్విరాన్‌మెంట్ సైన్స్, జియో ఫిజిక్స్, జియో కెమిస్ట్రీ వంటి పీజీ, యూజీ కోర్సులు ప్రవేశపెట్టారు. ఒక్కో కోర్సులో 60 సీట్లు కేటాయించారు.

# నిబంధనలు అతిక్రమిస్తే.. లైసెన్స్‌లు రద్దే

కరీంనగర్ : ఉరుకుల పరుగుల జీవితాలు, పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా ఇంటికో వాహనం ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే వాహనాలు నడపాలంటే తప్పనిసరిగా డ్రైవింగ్ లైసెన్స్, వాహనానికి సంబంధించిన ఆర్సీ, ఇతర ధ్రువపత్రాలు ఉండాల్సిందే. కానీ చాలామంది ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇతరులకు ప్రమాదాలు చేస్తున్నారు. కొందరు మద్యం తాగి వాహనం నడుపుతున్నారు. కేసు తీవ్రతను బట్టి పోలీసుల సిఫార్సు మేరకు లైసెన్స్‌లను తాత్కాలికంగా రద్దు చేస్తున్నారు..

**పాఠశాల స్థాయి నుంచి అవగాహన**

కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రాల్లో రవాణాశాఖ కార్యాలయాలు, హుజూరాబాద్, రామగుండం, కోరుట్లలో యూనిట్ కార్యాలయాలు సేవలందిస్తున్నాయి. వీటి పరిధిలో 2025 జనవరి 1 నుంచి ఇప్పటివరకు 164 మంది వాహనదారుల లైసెన్స్‌లు రద్దు చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసుల నమోదుతోపాటు తాత్కాలికంగా లైసెన్స్‌లు రద్దు చేస్తున్నారు. పాఠశాల స్థాయి నుంచే రోడ్డు భద్రతపై విద్యార్థులకు అవగాహన పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఒకసారి రద్దయితే తిరిగి లైసెన్స్ జారీ చేయకుండా



నిబంధనలు తీసుకురావడానికి కసరత్తు చేస్తోంది.

**మైనర్లు వాహనం నడపొద్దు**

18 ఏళ్లు నిండి డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న వ్యక్తి మాత్రమే వాహనాలు నడపడానికి అనుమతి ఉంటుంది. చాలా మంది మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. అలా నడిపి ఏదైనా ప్రమాదం జరిగితే వాహనం ఇచ్చిన వ్యక్తి కూడా శిక్షార్హుడు అవుతాడని అధికారులు చెబుతున్నారు. వాహనాలను నడిపే విషయంలో పిల్లలకు వారి తల్లిదండ్రులు సరైన అవగాహన కల్పించకపోవడం, స్వయంగా వారే వాహనాలు ఇస్తుండటంతో ఈ పరిస్థితి నెలకొంటోంది.

**తప్పనిసరిగా పాటించాల్సినవి**

ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలి.
ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలి.
లైసెన్స్, వాహనానికి సంబంధించిన పత్రాలు ఉండాలి.
ట్రాఫిక్ సిగ్నళ్లను అనుసరించాలి.
రహదారికి ఎడమ వైపు మాత్రమే వాహనం నడపాలి.
నీ మద్యం తాగి, ర్యాష్ డ్రైవింగ్, రాంగ్‌రూట్, ట్రిపుల్‌డ్రైవింగ్ లాంటివి చేయరాదు.

**చట్టరీత్యా చర్యలు..**

ప్రతి వాహనదారుడు నిబంధనల మేరకు వాహనాలు నడపాలి. లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలి. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ వాహనాలు ఇవ్వొద్దు. నిబంధనలు పాటించని వాహనదారులపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటాం.
– పెద్దింటి పురుషోత్తం, డీటీసీ

**ఉమ్మడి జిల్లాలో వివరాలు...**

| జిల్లా | లైసెన్స్‌లు రద్దు |
|---|---|
| కరీంనగర్ | 59 |
| జగిత్యాల | 39 |
| పెద్దపల్లి | 42 |
| రాజన్న సిరిసిల్ల | 24 |

# మనకూ ఔటర్ రింగ్ రైలు

భువనగిరి : ఇప్పటికే రెండు రైలు మార్గాలు.. నాలుగు జాతీయ రహదారులు.. యాదాద్రి భువనగిరి జిల్లా మీదుగా వెళ్తున్నాయి. త్వరలో ప్రాంతీయ వలయ రహదారి (ఆర్ఆర్ఆర్) రానుంది. హైదరాబాద్ బాహ్య వలయ రహదారికి 20 కి.మీ. దూరంలోనే జిల్లా ఉంది. ఈ నేపథ్యం రైలు రవాణా సౌకర్యాన్ని మరింత మెరుగుపరిచేందుకు రైల్వే శాఖ రూపొందించిన ఔటర్ రింగ్ రైలు ప్రాజెక్టుకు డీపీఆర్‌లో యాదాద్రి జిల్లా మీదుగా వెళ్లనుంది. దేశంలోనే ప్రప్రథమంగా ఔటరు రైలు ప్రాజెక్టుకు రూపకల్పన చేశారు. సికింద్రాబాద్–కాజీపేట రైలు మార్గంలో వంగపల్లి–ఆలేరు మధ్య, బీబీనగర్–నడికుడి మార్గంలో వలిగొండ–రామన్నపేట మీదుగా ఈ మార్గం వెళ్లనుంది.

ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే రూపొందించిన డీపీఆర్‌లో ఈ స్టేషన్లు రానున్నాయి. ప్రాంతీయ వలయ రహదారి సమాంతరంగా ఈ ప్రాజెక్టు రానుంది. ట్రిపుల్‌ఆర్‌కు 3–5 కి.మీ. దూరంలో రైలు మార్గం వెళ్లనుంది. రవాణా వ్యవస్థను మరింత మెరుగుపరిచి ప్రాంతాల మధ్య దూరాన్ని తగ్గించే ఉద్దేశంతో జాతీయ రహదారుల విభాగం, రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ సంయుక్తంగా ప్రాంతీయ వలయ రహదారి నిర్మాణం చేపడుతున్న విషయం విదితమే. హైదరాబాద్ మహానగరం చుట్టూ 361 కి.మీ. మీర వేయనున్న ప్రాంతీయ వలయ రహదారి జిల్లాలోని తుర్కపల్లి, యాదగిరిగుట్ట, భువనగిరి, వలిగొండ, చౌటుప్పల్ మీదుగా సుమారుగా 52 కి.మీ. వెళ్తుంది. భువనగిరి మండలం రాయగిరి వద్ద, చౌటుప్పల్‌లో ఇంటర్‌ఛేంజ్ సర్కిళ్లు రానున్నాయి. ప్రతిపాదిత ఔటర్ రింగ్ రైలు కూడా దాదాపు ఇదే మార్గంలో వెళ్లనుంది. డీపీఆర్‌లో చూపిన అలైన్‌మెంట్ ప్రకారం సికింద్రాబాద్–కాజీపేట రైలు మార్గంలో వంగపల్లి–ఆలేరు మధ్య, బీబీనగర్–నడికుడి మార్గంలో రామన్నపేట–వలిగొండ స్టేషన్ల మీదుగా వెళ్తుంది. ఈ ప్రాజెక్టులో పాత లైన్ మార్గంపై ఎత్తులో వంగపల్లి, వలిగొండ రైలు ఓవర్ రైలు (ఆర్వోఆర్) వంతెనలు వస్తాయి.

భువనగిరి, చౌటుప్పల్ ప్రాంతంలో అనేక పరిశ్రమలు వెలుస్తున్నాయి. జాతీయ రహదారులపై రద్దీ కూడా రోజురోజుకు పెరుగుతోంది. రాజధానికి చుట్టూ సమాంతర రోడ్డు, రైలు మార్గంతో నగరంపై ఒత్తిడి తగ్గుతుందని ప్రభుత్వ అంచనా.

**రైతుల గుండెల్లో రైళ్లు..**

జిల్లా మీదుగా ఔటర్ రైలు మార్గం వేయనున్నట్లు అధికారిక సమాచారం వెలువడటంతో రైతుల తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ప్రాంతీయ వలయ రహదారికి భూసేకరణతో మనోవేదనకు గురై ఉన్న రైతులకు మరోప్రాజెక్టు తమ మెడపైకి వస్తుందని గగ్గోలు పెడుతున్నారు. ఇప్పటికే అనేకమార్లు ప్రభుత్వ అవసరాలకు భూములు ఇచ్చి తీవ్రంగా నష్టపోయిన తాము ట్రిపుల్‌ఆర్‌కు భూములు ఇవ్వమని రాయగిరి, భువనగిరి మండలం, చౌటుప్పల్ రైతులు భీష్మించారు. సర్వేను అడ్డుకున్నారు. అవార్డు జారీ కార్యక్రమం బహిష్కరించారు. ఈ నేపథ్యంలో ఔటర్ రైలు కూడా ట్రిపుల్ ఆర్‌కు సమాంతరంగా డీపీఆర్ ఖరారు చేసినట్లు వెల్లడికావడంతో ఆందోళన చెందుతున్నారు.

# వంకర్లు తిప్పారు.. వరదలో ముంచారు



హైదరాబాద్: నీరు పల్లమెరుగు.. నిజం దేవుడెరుగు సామెతను ఇరిగేషన్ అధికారులు మార్చిపోయినట్లున్నారు. అందుకే శేరిలింగంపల్లి, ఖాజాగూడ, బయోడైవర్సిటీ ప్రాంతాల్లోని కాలనీల్లో కురిసే వాననీటిని తీసుకెళ్లే వరద నాలాల వెడల్పును మార్చారు. రియల్టర్లకు లాభం కలిగించేలా వాటిని అష్టవంకర్లు తిప్పారు. రూ.7.41కోట్ల వ్యయంతో కొద్దినెలల క్రితం నాలాలు నిర్మించారు. మూడురోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు వీటి సామర్థ్యం చాలకపోవడంతోకాలనీలు, జనావాసాలను వరద ముంచెత్తింది. బయోడైవర్సిటీ కూడలి వద్ద ప్రిన్స్‌టన్‌మాల్ ఎదురుగా రెండుకార్లు మునిగిపోయాయి.

**ప్రవాహ తీరును గుర్తించకుండా మూతలు..**

శేరిలింగంపల్లి నుంచి ఖాజాగూడ వరకూ చెరువుల్లోకి మురుగు వెళ్లకుండా డ్రైనేజ్ డైవర్షన్ పేరుతో జీహెచ్ఎంసీ వరదనీటి నాలాలను నిర్మించాలని నిర్ణయించింది. వీటి బాధ్యతను మేడ్చల్ జిల్లా నీటిపారుదలశాఖ అధికారులకు అప్పగించారు. వరద నాలాలు నిర్మించేప్పుడే వాటి సమీపంలోని రియల్ వెంచర్లు, బహుళ అంతస్తుల భవనాల ప్రహరీలను తొలగించకుండా నాలాల వెడల్పును తగ్గించారు. ఉదాహరణకు ఒక చోట నాలా వెడల్పు పది అడుగులుంటే ఏడు అడుగులకు కుదించారు. ఇంతేకాదు... నాలా వెడల్పు ఆరు అడుగుల కంటే ఎక్కువగా ఉంటే.. నాలాకు స్లాబ్ వేయకూడదు. ఇందుకు విరుద్ధంగా నాలాలపై మూతలు వేశారు.

**ఇక్కడ.. ఇలా తగ్గించారు...**

హఫీజ్‌పేట ప్రకాశ్‌నగర్ సమీపంలోని కొత్తకుంట నుంచి ఈర్ల చెరువులోకి వెళ్లే నాలాను నాలుగైదు అడుగులకు కుదించారు.
శ్రీదీప్తినగర్ వద్ద నాలాలను వంపులు తిప్పారు.
నల్లగండ్ల చెరువు కింద సహజంగా ఉన్న నాలాను మరో మార్గానికి తిప్పారు. ఈ చెరువులోకి వచ్చే వరద నాలాను మరో నిర్మాణ సంస్థ కోసం రెండు అడుగుల వెడల్పు తగ్గించారు.
గోపి చెరువుకి వరదను తీసుకువచ్చే నాలాలను రియల్ నిర్మాణాల కోసం పూడ్చేశారు.
మియాపూర్ కాయిదమ్మ చెరువులో మురుగు చేరకుండా పైప్‌లైన్లు వేశారు. సరైన అలైన్‌మెంట్ లేక.. పైపుల్లోకి వెళ్లాల్సిన మురుగు తిరిగి చెరువులోకి చేరుతోంది.

# శ్వాస కోల్పోతున్న ఛాతీ ఆసుపత్రి



అమీర్‌పేట : తెలంగాణతో పాటు పరిసర రాష్ట్రాలకు ప్రజలకు వైద్య సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఎర్రగడ్డలోని ప్రభుత్వ ఛాతీ ఆసుపత్రి క్రమంగా ఉనికిని కోల్పోతుంది. 670 పడకల సామర్థ్యం కలిగిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం 310 పడకలే ఉన్నాయి. వైద్యశాలలో తాగునీటి వసతి లేదు. క్షయ, ఛాతీ సమస్యలు, శ్వాసకోశ ఇబ్బందులు, అలర్జీ తదితర వ్యాధులకు చికిత్స అందించగలిగే వైద్య నిపుణులు ఈ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్నా దీని అభివృద్ధిని ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలున్నాయి. స్వైన్‌ఫ్లూ, కోవిడ్‌లకు సమర్థంగా చికిత్స అందించిన ఈ ఆసుపత్రిలో ప్రస్తుతం పడకల సంఖ్య తగ్గడంతో పాటు సౌకర్యాల లేమితో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో బోర్లు ఎండిపోయాయి. దీంతో నిత్యం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా అవసరాలకు చాలడం లేదు.

**చరిత్ర ఘనం.. ఉనికి ప్రశ్నార్థకం**

నిజాం సర్కారు పాలనలో జాగీర్దారు ఫక్రుంముల్క్ క్షయ ఆసుపత్రి ఏర్పాటు కోసం 70 ఎకరాలకు పైగా స్థలాన్ని అప్పటి ప్రభుత్వానికి ఇచ్చారు. దీంతో 670 పడకలతో నిజాం ప్రభుత్వం టీబీ ఆసుపత్రిని ఏర్పాటు చేసింది. హైదరాబాద్ సంస్థానం భారత్‌లో విలీనమైన తరువాత ఛాతీ ఆసుపత్రి ప్రభుత్వ వైద్యశాలగానే కొనసాగుతోంది. నవాబు ఫక్రుంముల్క్ తాను వినియోగించిన విలాసవంతమైన ఇర్రంనుమా ప్యాలెస్‌లోనే ఛాతీ ఆసుపత్రి కొనసాగేది. ఇది శిథిలమైపోవడంతో అక్కడి పడకలను ఎత్తివేశారు. సమీపంలో నిర్మించిన కొత్త భవనంతో పాటు వెనుక వైపు ఉన్న షెడ్లలో మాత్రమే పడకలు కొనసాగుతున్నాయి. ఛాతీ ఆసుపత్రి ఆవరణలోని సుమారు 17 ఎకరాల స్థలంలో గత ప్రభుత్వం 1000 పడకలతో ప్రారంభించిన టిమ్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం పూర్తికావచ్చింది. ఈ క్రమంలో ఛాతీ ఆసుపత్రి అభివృద్ధిపై అధికారులు దృష్టి నిలపడం లేదు. **రోగుల సంఖ్యా అధికమే**

నిత్యం 450 మంది వరకు రోగులు చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 300 మంది వరకు ఇన్‌పేషెంట్లుగా ఉంటున్నారు. 200 మందికి పైగా వైద్య సిబ్బంది ఉన్నారు. పెద్దసంఖ్యలో శ్వాసకోశ వైద్య నిపుణులు ఉన్న ఏకైక ఆసుపత్రి ఇదే కావడం గమనార్హం. ఈ పరిస్థితిలో ఉన్నతాధికారులు స్పందించి ఆసుపత్రి అభివృద్ధికి చర్యలు చేపట్టాల్సిన అవసరముంది.

# రూ.కోట్లలో వ్యయం.. పనుల్లో జాప్యం



కరీంనగర్ : కరీంనగర్ నగరపాలక సంస్థ పరిధిలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన అభివృద్ధి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన పట్టణ ప్రగతి నిధులు పూర్తిగా నిలిచిపోవడంతో సమస్యలు మొదలయ్యాయి. రెండున్నర ఏళ్ల కిందట ఆధునిక హంగులతో కొత్త మార్కెట్లు, అమృత్ వర్షిణి ఆడిటోరియం పనులు చేసేందుకు పట్టణ ప్రగతి, స్మార్ట్‌సిటీ, సీఎంఏ నిధులను కేటాయించారు. కిసాన్‌నగర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట నిర్మించే సమీకృత మార్కెట్లతోపాటు ఎస్సారార్ కళాశాల సమీపంలో ఆడిటోరియం నిర్మాణ పనులకు పట్టణ ప్రగతి, ముఖ్యమంత్రి హామీ నిధులను మంజూరు చేశారు. పద్మనగర్, కశ్మీర్‌గడ్డలోని పనులకు స్మార్ట్‌సిటీ నిధులు కేటాయించారు. కశ్మీర్‌గడ్డలోని నిర్మాణం స్లాబ్ దశలో ఉంది. మిగతా చోట్ల పురోగతి కనిపించడం లేదు.

**వివాదాస్పదంగా కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్**

కిసాన్‌నగర్‌లోని సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు 70 శాతం పూర్తయ్యాయి. అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేయడం, ఎంబీ పుస్తకం మాయం కావడంతో ఒక ఏఈ ఇటీవల సస్పెండ్ అయ్యారు. కేటాయించిన నిధులతో పనులన్నీ పూర్తి చేసి ప్రారంభించాల్సి ఉండగా, అవేవి లేకుండానే బిల్లులు రికార్డు చేయడం వివాదాస్పదంగా మారింది. స్లాబ్‌లు, గోడలు, ప్లాట్‌ఫాంలు నిర్మించి వృథాగా వదిలేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

కిసాన్‌నగర్ సమీకృత మార్కెట్, అమృత వర్షిణి ఆడిటోరియం నిర్మాణాలు నిలిచిపోవడంతో.. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. మందుబాబులు స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్నారు. నిత్యం గోడలు పగులకొడుతూ చిందరందర చేస్తున్నారు.

**ఎలా ఉన్నాయంటే..**

రూ.10.05 కోట్లతో కశ్మీర్‌గడ్డ రైతుబజారు స్థలంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనుల్లో భాగంగా స్లాబ్ వేసేందుకు సెంట్రింగ్ పనులు చేస్తున్నారు.

రూ.5.80 కోట్లతో కిసాన్‌నగర్‌లోని వ్యవసాయ మార్కెట్ స్థలంలో జీం1లో 146 దుకాణాలు, పార్కింగ్ వంటి సౌకర్యాలతో నిర్మించేందుకు స్లాబ్‌లు, దుకాణాల అరలు నిర్మించారు. ప్రస్తుతం ఈ పనులు నిలిచిపోయి పిచ్చి మొక్కలు పెరిగాయి.

కలెక్టర్ క్యాంపు కార్యాలయం ఎదుట 2.31 ఎకరాల స్థలంలో మొత్తం 347 దుకాణాలతో నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం అరలు, గోడల పనులు చేస్తున్నారు. ఎస్సారార్ కళాశాల సమీపంలో నిర్మిస్తున్న ఆడిటోరియం పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి.

# ఆదాయ మార్గం.. జాతీయ పురస్కారం

గోదావరిఖని : పొదుపు మంత్రం సింగరేణి సంస్థకు జాతీయ స్థాయిలో పురస్కారం తెచ్చిపెట్టింది. దుబారా నియంత్రించి సంస్థ ఆదాయం పెంచే విధంగా చర్యలు చేపట్టడం ద్వారా సంస్థకు 2024 సంవత్సరానికి గాను ఇనిస్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ) జాతీయ స్థాయిలో తృతీయ బహుమతి ఇచ్చింది. ఇటీవల దిల్లీలో యాజమాన్యానికి పురస్కారాన్ని అందజేసింది.

**18 గంటలు పనిచేసేలా..**

సింగరేణి బొగ్గు ఉత్పత్తికి వినియోగించే యంత్రాల పనిగంటలు పెంచటంపై దృష్టి పెట్టింది. ముఖ్యంగా ఉపరితల గనుల్లో పనిచేసే



డంపర్లు, డోజర్లు, షావల్ యంత్రాలతో పాటు భూగర్భ గనుల్లోని కంటిన్యూస్‌మైనర్, ఎస్డీఎల్, ఎల్‌హెచ్‌డీ యంత్రాల పనిగంటలు పెంచే ప్రయత్నం చేస్తోంది. దీని ద్వారా ఉత్పత్తి వ్యయం తగ్గే అవకాశం ఉంది. ఈ పొదుపు చర్యలకు సింగరేణికి జాతీయ స్థాయిలో పురస్కారం లభించింది. గత కొంతకాలంగా యంత్రాల పనితీరుపై దృష్టి సారించిన సింగరేణి కనీసం రోజుకు 18 గంటలు పనిచేసే విధంగా చర్యలు చేపట్టింది.

**నష్టం పూడ్చటానికి..**

భూగర్భగనుల ద్వారా గత ఐదేళ్లలో సంస్థకు రూ.13,093 కోట్ల నష్టం వాటిల్లింది. దీనిని అధిగమించేందుకు ఉపరితల గనుల్లో యంత్రాల పనిగంటలు పెంచారు. భూగర్భగనుల్లో ఉత్పత్తి వ్యయం తగ్గించటంతో పాటు లాభాలు అర్జించేందుకు ఎస్డీఎల్, ఎల్‌హెచ్‌డీ, కంటిన్యూస్ మైనర్ యంత్రాల పనితీరును మరింత మెరుగుపర్చుతున్నారు.

# కొత్త వారికి అవకాశం

సూర్యాపేట : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీల్లో భాగంగా పలు పథకాలను అమలు చేసింది. వీటిలో ప్రధానంగా మహాలక్ష్మిలో రూ.500కు వంటగ్యాస్, గృహజ్యోతిలో 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్తు వంటివాటికి రేషన్ కార్డులు తప్పనిసరిగా ఉండాల్సి ఉంటుంది. కాగా పదేళ్లుగా రేషన్ కార్డులు మంజూరు కాకపోవడంతో గత, ప్రస్తుత ప్రభుత్వాల్లో వివిధ పథకాలకు అర్హులు దూరమయ్యారు. ప్రస్తుతం ప్రభుత్వం రేషన్ కార్డులు మంజూరు చేస్తుండటంతో లబ్ధిదారుల్లో ఆశలు చిగురించాయి. మహాలక్ష్మి, గృహజ్యోతి పథకాలకు దరఖాస్తు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా అవకాశం కల్పించింది. దీంతో లబ్ధిదారులు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకుంటున్నారు. జిల్లా వ్యాప్తంగా 3.24 లక్షల మంది అర్హులు ఉండగా అందులో కేవలం 1.62 మందికి మాత్రమే మహాలక్ష్మి,



గృహజ్యోతి పథకాలు వర్తిస్తున్నాయి. మిగతా వారు దరఖాస్తు చేసుకున్నా అమలు కాలేదు. ఎంపీడీవో, కలెక్టరేట్ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండాపోయింది. కాగా కొత్తగా రేషన్ కార్డులు స్వీకరించిన వారి నుంచి దరఖాస్తులు తీసుకుంటుండటంతో మరోమారు దరఖాస్తు చేసుకుంటున్నారు.

**దరఖాస్తులు స్వీకరిస్తున్నాం**

–శ్రీనివాస్‌రెడ్డి, ఏఎస్‌వో, సూర్యాపేట

మహాలక్ష్మి పథకానికి సంబంధించి దరఖాస్తులు స్వీకరిస్తున్నాం. అర్హులు ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలి. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే కొత్తగా రేషన్ కార్డులు పొందిన వారికి ఇవి వర్తిస్తాయి. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

# వైద్యుల కొరత.. రోగుల వెత

భువనగిరి : జిల్లాలో ఆరోగ్య కేంద్రాలను వైద్యులు, సిబ్బంది ఖాళీలు వేధిస్తున్నాయి. మొత్తం 21 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, భువనగిరి పట్టణంలో ఒక అర్బన్ హెల్త్ సెంటర్ ద్వారా రోగులకు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఒక్కో పీహెచ్‌సీలో సగటున 100 మందికి పైగా రోగులు వస్తున్నారు. పూర్తిస్థాయి వైద్యులు లేక రోగులు ఇబ్బంది లు పడుతున్నారు. 24 గంటల వైద్యం అందించే ఆరోగ్య కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి. మధుమేహ వ్యాధిగ్రస్థులకు ఇన్సులిన్ కూడా అందుబాటులో లేదు. జిల్లాలోని పీహెచ్‌సీల్లో 'న్యూస్‌టుడే' పరిశీలన అంశాలు ఇవీ..రాజపేట మండల కేంద్రంలోని 24 గంటల వైద్య కేంద్రంలో ఒక్కరే వైద్యుడు సేవలు అందిస్తున్నారు. గైనకాలజిస్ట్ పోస్టు భర్తీ కావల్సి ఉంది. జిల్లాలోని మారుమూల మండలం ఇది. ఇక్కడ సాయంత్రం వేళల్లో ఆత్మహత్యాయత్నాలు, పాము, తేలు కాటు ఘటనలు ఎక్కువగా జరుగుతుంటాయి. రాత్రి వేళల్లో స్టాఫ్ నర్సు వైద్యం అందిస్తున్నారు.యాదగిరిగుట్ట పీహెచ్‌సీకి నిత్యం వంద మందికి పైగా రోగులు వస్తుంటారు. ఇద్దరు వైద్యుల్లో ఇటీవల ఒకరు పీజీ కోర్సుకు వెళ్లారు. దీంతో ఒక వైద్యుడితోపాటు సూపర్‌వైజర్ (మేల్) ఖాళీగా ఉన్నాయి. స్థానికులను, దేవస్థానానికి వచ్చే భక్తులను పరీక్షించడం కష్టంగా మారింది. గుండ్లపల్లి, మాసాయిపేటలో వైద్యుల పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. ఆత్మకూరు(ఎం) 24 గంటల పీహెచ్‌సీలో ఇద్దరికిగాను ఒక్క వైద్యుడే ఉన్నారు. ఆదివారం, ఇతర సెలవు రోజులు, అధికారుల సమావేశాలు, సమీక్షలు ఉన్న రోజుల్లో సిబ్బంది వైద్యమే రోగులకు దిక్కవుతోంది. భువనగిరి అర్బన్‌కాలనీలోని అర్బన్ హెల్త్‌సెంటర్(యూ హెచ్‌సీ) అద్దె భవనంలో కొనసాగుతోంది. ఇక్కడ ప్రాథమిక ఆరోగ్య సేవలు మాత్రమే అందుతున్నాయి. 24 గంటల వైద్యసేవలు అందించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. ప్రతి సోమవారం గర్భిణులకు వైద్యసేవలతో పాటు ఎన్‌సీడీ శిబిరం, వ్యాక్సినేషన్ అందిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ నిరోష తెలిపారు.

మోత్కూరు పీహెచ్‌సీలో తాగునీరు లేక రోగులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు. మూడేళ్ల కింద మరమ్మతులకు గురైన నీటిశుద్ధి యంత్రంను బాగుచేయించడంలేదు. ఇక్కడ ముగ్గురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒకరిని రెండేళ్ల క్రితం భువనగిరి యూహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపారు. ఎంపీహెచ్‌ఎస్ (మేల్) పోస్టు, ఎంపీహెచ్‌ఈఓ, స్టాఫ్‌నర్స్ పోస్టులు ఏడాదిగా ఖాళీగా ఉన్నాయి.

# పోరుకు సన్నద్ధం

నల్గొండ : స్థానిక సంస్థల ఎన్నికలపై ఉత్కంఠ వీడింది. 90 రోజుల్లో ఎన్నికలు పూర్తి చేయాలని హైకోర్టు బెంచ్ ఆదేశాలు ఇవ్వడంతో ప్రభుత్వం ఎన్నికలకు సన్నద్ధం అవుతోంది. ముందుగా పార్టీ గుర్తులతో ఎన్నికలు జరిగే జిల్లా, మండల ప్రాదేశిక నియోజకవర్గాలకు పోలింగ్ నిర్వహించేందుకు ప్రభుత్వ యంత్రాంగం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది. అందులో భాగంగా ఎన్నికల్లో కీలక పాత్ర పోషించే మండల పరిషత్తు అధికారు(ఎంపీడీవో)ల బదిలీలు చేపట్టేందుకు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పార్లమెంటు ఎన్నికల ముందు జిల్లా నుంచి సుమారు 20 మంది ఎంపీడీవోలు సంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. వారు తిరిగి నల్గొండకు వచ్చే అవకాశం ఉంది. బదిలీ కోసం దరఖాస్తు చేసుకునే అధికారుల వివరాలు పంపించాలని జిల్లా పరిషత్తు అధికారులకు ఆదేశాలు అందడంతో వివరాలు సేకరించి జాబితా పంపించే పనిలో నిమగ్నమయ్యారు.

**రాష్ట్రంలోనే పెద్ద జడ్పీ**

రాష్ట్ర అసెంబ్లీ తర్వాత నల్గొండ జిల్లాపరిషత్తు మినీ అసెంబ్లీని తలపించనుంది. తెలంగాణ రాష్ట్రంలో జిల్లాల, మండలాల పునర్విభజన, కొత్త మండలాల ఏర్పాటుతో రాష్ట్రంలోనే నల్గొండ పెద్ద జిల్లాగా రూపాంతరం చెందింది. గత అసెంబ్లీ ఎన్నికల ముందు జిల్లాలో రెండు కొత్త మండలాలు ఏర్పాటుతో 31 జడ్పీ స్థానాల నుంచి 33 వరకు చేరాయి.



మండల పరిషత్తు ప్రాదేశిక నియోజకవర్గాలు 349 ఉండగా పునర్విభజనతో 352 స్థానాలకు చేరాయి. ఇక్కడ జడ్పీ ఛైర్మన్‌కు దాదాపు సహాయ మంత్రి హోదా దక్కనుండటంతో చాలా మంది నేతలు జడ్పీ ఛైర్మన్ కుర్చీపై ఆశలు పెట్టుకున్నారు.

**ఏర్పాట్లు పూర్తి..!**

ప్రాదేశిక సమరానికి ఎప్పుడు ప్రకటన వచ్చిన ఎన్నికలు నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం సన్నద్ధమైంది. ఇప్పటికే రిజర్వేషన్లు మినహా ఇతర అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేసింది. ఎంపీటీసీల పునర్విభజన, ఓటర్ల విభజన వంటి ప్రక్రియ పూర్తి చేసి పోలింగ్ కేంద్రాలను గుర్తించింది. ఎన్నికల నిర్వహణలో కీలక పాత్ర పోషించే అధికారులకు, సిబ్బందికి ఇప్పటికే రెండు విడతలుగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలో నిర్వహించనుండటంతో దీనికి ఉపయోగించే పేపరును దిగుమతి చేసి నిల్వ ఉంచారు.

# సీడీపీ నిధులకు గ్రహణం

నల్గొండ : నియోజకవర్గ అభివృద్ధి పథకానికి గ్రహణం పట్టింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 18 నెలలు కావొస్తున్నా.. ఎమ్మెల్యేలకు నియోజకవర్గ అభివృద్ధి పథకం(సీడీపీ) కింద వచ్చే నిధులు మాత్రం విడుదల కావడం లేదు. దీంతో ఎమ్మెల్యేలు అభివృద్ధి పనులు చేపట్టలేని పరిస్థితి ఏర్పడింది.

**గతంలో ఇలా..**ఎమ్మెల్యేలు తమ నియోజకవర్గాల్లో పర్యటించినప్పుడు ప్రజలు ఇచ్చిన అర్జీల పరిష్కారం, సదుపాయాల కల్పన, తక్షణ అవసరాలు తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గ అభివృద్ధి పథకాన్ని అమలు చేస్తోంది. గతంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి రూ.3 కోట్లు కేటాయించగా, ఆ నిధులను 2022-23లో భారాస ప్రభుత్వం రూ.5 కోట్లకు పెంచింది. ఇందులో రూ.3 కోట్లను ఎమ్మెల్యే పలు అభివృద్ధి కార్యక్రమాలకు చేపట్టే అవకాశం ఉండగా, మిగిలిన రూ.2 కోట్లు విద్యాశాఖలో పాఠశాలల అభివృద్ధికి వెచ్చించాలని పేర్కొంది. అయితే విద్యాశాఖకు కేటాయించిన నిధులను గత ప్రభుత్వం నేరుగా ఆ శాఖకు విడుదల చేసేది. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పూర్తిగా ఈ నిధులను నిలిపివేయడంతో అభివృద్ధి పనులకు బ్రేక్ పడుతుంది. నిధులు విడుదల చేస్తే తాగునీరు, రహదారులు, అసంపూర్తి భవనాల పూర్తి , గ్రామాల్లో సదుపాయాల కల్పన, ఇతర అభివృద్ధి పనులకు వెచ్చించే అవకాశం ఉంటుంది.

**ఎస్‌డీఎఫ్‌తోనే అభివృద్ధి పనులు**

సీడీపీ నిధులను ప్రభుత్వం కేటాయించకపోవడంతో నియోజకవర్గాల్లో ప్రత్యేక అభివృద్ధి నిధులు(ఎస్‌డీఎఫ్)తోనే అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ప్రతి నియోజకవర్గానికి ఎస్‌డీఎఫ్ కింద రూ.10 కోట్లు మంజూరవుతాయి. ఈ నిధులను ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో పనులు చేపట్టాల్సి ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో 12 నియోజకవర్గాలు ఉండగా వాటిలో సూర్యాపేట నియోజకవర్గం మినహా అన్ని నియోజకవర్గాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలే ఉన్నారు. సూర్యాపేటలో మాత్రం భారాస ఎమ్మెల్యే ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన నుంచి సీడీపీ నిధులు విడుదల కాకపోవడంతో కొంతమంది ఎమ్మెల్యేలు నిరాశ వ్యక్తం చేస్తున్నారు. సీడీపీ నిధులు విడుదల చేస్తే నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టవచ్చని, అలాగే ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించే అవకాశం ఉంటుందని కొందరు ఎమ్మెల్యేలు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# మంత్రులారా.. మా గోడు వినండి!

తలమడుగు : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం సుంకిడి కొత్త వ్యవసాయ మార్కెట్‌యార్డు ఏర్పాటు 16 ఏళ్లుగా ఊరిస్తూనే ఉంది. తొలుత సబ్ మార్కెట్‌యార్డు అనుకున్నా పూర్తిస్థాయి ప్రత్యేక మార్కెట్‌యార్డుకు అడుగులు ముందుకు పడినా అది స్థల సేకరణకే పరిమితమైంది. మార్కెట్ యార్డు ఎప్పుడు అందుబాటులోకి వస్తుందోనని తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు ఏళ్లుగా ఎదురుచూస్తున్నారు. తలమడుగు మండలంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామిల పర్యటన ఉన్నందున మూడు మండలాల రైతులు తమ గోడును విన్నవించనున్నారు. ఆదిలాబాద్‌లో వ్యవసాయ మార్కెట్‌యార్డు పరిధిలో ఆదిలాబాద్ గ్రామీణం, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు, తాంసి, భీంపూర్ మండలాల రైతులు తమ పంట ఉత్పత్తులను తీసుకొస్తారు. ఖరీఫ్, రబీ సీజన్లలో రైతులు పండించిన

పత్తి, సోయా, శనగలు, కందులు, జొన్న పంటలను విక్రయించేందుకు ఆదిలాబాద్ మార్కెట్‌కు వెళ్లాల్సి వస్తోంది. విక్రయాల వేళ రైతులంతా పంటను మార్కెట్‌కు తీసుకొచ్చేందుకు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా భీంపూర్, తలమడుగు, తాంసి మండలాల్లోని పలు గ్రామాల రైతులు 45 కిలోమీటర్లకు పైగా ప్రయాణం చేసి ఆదిలాబాద్ పట్టణానికి పంట తీసుకొస్తూ అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ పరిధిలో ఆరు మండలాలకు చెందిన 40 వేల మంది రైతులు ఉన్నారు. ఆదిలాబాద్ మార్కెట్‌లో పంట విక్రయించేందుకు అక్కడే రెండు నుంచి మూడు రోజులు పడిగాపులు కాయాల్సి వస్తోంది. మూడు మండలాల రైతుల ప్రయోజనార్థం సుంకిడిలో మార్కెట్‌యార్డు ఏర్పాటు చేయాలనే డిమాండ్ ఏళ్ల నుంచి ఉంది. తద్వారా 15 కిలోమీటర్లకు పైగా దూరం తగ్గుతుంది. రైతుల పడిగాపుల ఇబ్బందులు దూరమవుతాయి. సుంకిడిలో మార్కెట్ యార్డు నిర్మాణం జరిగితే 24 వేల మంది అన్నదాతలకు ప్రయోజనం కలుగుతుంది.

# అందని గ్యాస్ రాయితీ.. ఎదురుచూపులే గతి



హైదరాబాద్ : జిల్లాలో వంట గ్యాస్ వినియోగదారులు రాయితీ డబ్బుల కోసం సుమారు ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారెంటీల్లో మహాలక్ష్మి పథకంలో భాగంగా రూ.500లకే గ్యాస్ పథకాన్ని అమలు చేస్తోన్న విషయం తెలిసిందే. ఈ పథకం ప్రారంభించిన నాటి నుంచి కొన్నాళ్లు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో రాయితీ డబ్బులు జమ చేసినా.. గత ఆరు నెలలుగా జమ కావడం లేదు. దీంతో లబ్ధిదారులు ఎవరిని సంప్రదించాలో అర్థం కాక అయోమయంలో ఉంటున్నారు. జిల్లాలో 3,65,101 గ్యాస్ కనెక్షన్లు ఉండగా అందులో గ్యాస్ రాయితీకి 2,76,913 మంది అర్హులు ఉన్నారు. వీరికి గతేడాది మార్చి నాటి నుంచి రాయితీ అమలు చేస్తున్నారు. ఆ సమయంలో గ్యాస్ సిలిండర్ ధర రూ.874 ఉండగా రాష్ట్ర ప్రభుత్వం రూ.500 లబ్ధిదారుల ఖాతాలో జమ చేసేది. మిగతా మొత్తం లబ్ధిదారులు చెల్లించాల్సి వచ్చేది. లబ్ధిదారులు చెల్లించిన మొత్తంలో కేంద్ర ప్రభుత్వం రూ.47.38లను రాయితీ కింద జమ చేస్తుంది. ఈ లెక్కన సిలిండర్ రూ.326.62లకే వచ్చేది. దీంతో ఈ పథకం నిరుపేదలకు, మధ్యతరగతి బడ్జెట్ జీవులకు ఆసరాగా ఉండేది.

**ధర పెరగడంతోనూ ఇక్కట్లు..**

గత కొంతకాలంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ డబ్బులను జమ చేయడం లేదు. దీంతో లబ్ధిదారులు సిలిండర్ ధరను పూర్తిగా చెల్లించాల్సి వస్తోంది. దీనికితోడు మూలిగే నక్కపై తాటి పండు అన్న చందంగా రాష్ట్ర ప్రభుత్వం రాయితీ జమ చేయడం మానేస్తే మరోవైపు ఎల్‌పీజీ గ్యాస్ కంపెనీలు ఒక్కసారిగా ధరలను అమాంతం పెంచాయి. ప్రస్తుతం గ్యాస్ సిలిండర్ రూ.924లకు లభిస్తోంది. దీనికి కేంద్ర ప్రభుత్వం అందించే రూ.47.38 పోను వినియోగదారునికి రూ.876,62 చెల్లించాల్సి వస్తోంది. మరోవైపు ప్రభుత్వ పథకం కింద రాయితీ జమ కాకపోవడంతో లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయమై పౌరసరఫరాలశాఖ అధికారులను సంప్రదించగా ప్రభుత్వ నిర్ణయంపై ఆధారపడి ఉంటుందన్నారు.

**మూడు నెలలే జమ** గ్యాస్ రాయితీ ఖాతాలో మూడు నెలలు జమ చేశారు. ఆపై వేయడం లేదు. ప్రతి నెలా గ్యాస్ రాయితీ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా రాయితీ డబ్బులు జమ చేయాలి. – శారద, గృహిణి, కరీంనగర్

# శంకుస్థాపనకే పరిమితం.. పట్టాలెక్కితే ప్రయోజనం




కరీంనగర్ : రవాణాశాఖ కార్యాలయాల్లో ఏజెంట్ల ప్రమేయం, అవినీతికి ఆస్కారం లేకుండా పని జరగాలనే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఉమ్మడి జిల్లాకు ఒకటి చొప్పున వాహనాల ఏటీఎస్(ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్)ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా మొదట కరీంనగర్ జిల్లా రవాణాశాఖ కార్యాలయ ఆవరణ(తిమ్మాపూర్)లో ఏటీసీ సెంటర్ ఏర్పాటుకు నిర్ణయించారు. రూ.8 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ఈ సెంటర్‌కు మార్చి 23న రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ శంకుస్థాపన చేశారు. వీటి నిర్మాణ బాధ్యత, యంత్రాల బిగింపు ప్రక్రియను ఆర్అండ్‌బీకి అప్పగించారు. అయితే నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు పనులు ప్రారంభం కాలేదు.

**సాంకేతికతతో మేలు**

ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లు నిండిన వాహనాలు 1.74 లక్షలకుపైగా ఉన్నాయి. ప్రస్తుతం ఆయా వాహనాలు తిరిగి రోడ్డెక్కాలంటే ఆర్టీఏ అధికారులు మ్యాన్యువల్‌గా పరీక్షలు చేసి ధ్రువీకరణపత్రాలు జారీ చేస్తున్నారు. ఏటీఎస్ స్టేషన్ అందుబాటులోకి వస్తే వాహనాన్ని అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో పరీక్షిస్తారు. వాహనంలోని అన్ని భాగాలు కండిషన్‌లో ఉన్నట్లు నిర్ధారిస్తేనే ఎఫ్‌సీ ధ్రువీకరణపత్రం జారీ అవుతోంది.

**అన్ని రకాల వాహనాలకు..**అత్యాధునిక సాంకేతికను జోడించి అందుబాటులోకి తెస్తున్న ఏటీఎస్ సెంటర్‌లో ద్విచక్ర, ఆటోలు, కార్లు ఇలా అన్ని రకాల వాహనాలను యంత్రాల ద్వారా పరీక్షిస్తారు. వాహనం నుంచి వచ్చే పొగ, వాహనాల టైర్లు, షాక్ అబ్జర్వర్ల పటిష్టత, టైర్ల అమరిక, ఇంజిన్ పని తీరు, వాహనం నిర్దేశించిన వేగం అందుకుంటుందా, ఇలా ప్రతీ విడి భాగాన్ని క్షుణ్నంగా పరీక్షించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. దీంతో ప్రమాదాల, కాలుష్య నివారణను తగ్గించడానికి వీలుంటుంది. ఆర్అండ్‌బీ శాఖ చూస్తోంది– పెద్దింటి పురుషోత్తం, డీటీసీ ఏటీఎస్ స్టేషన్ నిర్మాణ బాధ్యత రోడ్లు, భవనాల శాఖ చూస్తుంది. టెండర్ల విషయం, నిర్మాణం, యంత్రాల బిగింపు పూర్తయిన తర్వాతే మా పరిధిలోకి వస్తుంది. ఏటీఎస్ స్టేషన్ త్వరలో అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది.

**త్వరలో టెండర్లు పిలుస్తాం**

– నర్సింహాచార్యులు, ఈఈ, ఆర్అండ్‌బీ శాఖ

జిల్లా రవాణాశాఖ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేయనున్న ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్(ఏటీఎస్)కు సంబంధించి త్వరలో టెండర్లు పిలుస్తాం. టెండర్ ప్రక్రియ పూర్తికాగానే పనులు ప్రారంభిస్తాం.

ఉమ్మడి జిల్లాలో 15 ఏళ్లు దాటిన వాహనాలు

| జిల్లా | వాహనాలు |
|---|---|
| కరీంనగర్ | 1,58,129 |
| జగిత్యాల | 4,283 |
| పెద్దపల్లి | 9,660 |
| రాజన్న సిరిసిల్ల | 2039 |

# చెరువుల్లో మట్టి దొంగలు



ధర్మపురి: ధర్మపురి పరిధిలోని పలు గ్రామాల చెరువులు, కుంటల నుంచి ఎలాంటి అనుమతులు లేకుండానే దర్జాగా మట్టి అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. దీనిపై మైనింగు, రెవెన్యూ అధికారులు ఏమాత్రం దృష్టి సారించడం లేదు. ధర్మపురి పట్టణంతోపాటు పలు గ్రామాల్లోని గుట్టలు, చెరువుల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. దీంతో పలు చెరువుల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. నీరు ఎక్కువగా ఉన్న సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వానాకాలంలో చెరువుల్లోకి దిగిన రైతులు, యువకులు ప్రమాదాల బారిన పడుతున్నారు.

**ప్రభుత్వ ఆదాయానికి గండి**దొంతాపూర్, తీగలధర్మారం గ్రామాల్లో గుట్టల ప్రదేశాల్లో మట్టిని తోడేస్తున్నారు. ఆయా పంచాయతీలకు, ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించడం లేదు. దీంతో అటు ప్రభుత్వ ఆదాయానికి గండి పడటం, మరోవైపు ప్రకృతి సహజ సంపద తరిగిపోతుందని స్థానికులు, రైతులు వాపోతున్నారు. అధికారులు వెంటనే దీనిపై దృష్టి నిలిపి చెరువులు, గుట్టల నుంచి తవ్వకాలు, రవాణాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

**ఇటుక బట్టీలకు తరలింపు**

ధర్మపురి పట్టణంతోపాటు చుట్టుపక్కన సుమారు పల్లెల్లో పది వరకు ఇటుక బట్టీ పరిశ్రమలున్నాయి. అక్రమంగా తవ్వుతున్న మట్టిని ఇక్కడికి తరలిస్తున్నారు. దీనికి ప్రభుత్వానికి ఎలాంటి పన్ను చెల్లించడంలేదు. దీంతోపాటు పల్లెల్లో రహదార్లకు, ఇళ్ల నిర్మాణాలకు ఈ మట్టినే వినియోగిస్తున్నారు. వెంటనే ఈ మట్టి అక్రమ రవాణాను అరికట్టాల్సిన అవసరముంది. **ఒక్కో ట్రిప్పునకు రూ.5 వేలు**

ధర్మపురితోపాటు, నక్కలపేట, దోనూర్, తీగలధర్మారం, దొంతాపూర్, జైన, నేరెళ్ల ప్రాంతాల్లో ఈ దందా జోరుగా సాగుతోంది. నేరెళ్ల–వెల్గొండ మధ్యన దూర ప్రాంతాల్లో ఎర్రమట్టి గుట్టలున్నాయి. ఇవన్నీ రిజర్వు అటవీ భూములే. ఇక్కడ ఎలాంటి మట్టిని తీయాలన్నా తప్పనిసరిగా అటవీ అధికారుల అనుమతి తీసుకోవాలి. ఈ ఎర్రమట్టికి విలువ ఉండటంతో గుత్తేదార్లు గుట్టు చప్పుడు కాకుండా తరలిస్తున్నారు. రాత్రిళ్లు ఈ తతంగం అంతా జరుగుతోంది. దీనికి ఒక ట్రాక్టర్ ట్రిప్పుకు రూ.5 వేల వరకు డిమాండు ఉంటోంది.

**చర్యలు తీసుకుంటాం**ధర్మపురితోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో చెరువుల నుంచి అక్రమ మట్టి తవ్వకాలపై దృష్టి సారిస్తాం. పల్లెల్లోని చెరువుల నుంచి మట్టిని తీసుకుని వెళ్లాలంటే తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. – ఇన్‌ఛార్జి తహసీల్దార్, సుమన్

# ఉన్నతంగా అడుగేయ్ విద్యార్థి..!

నాంపల్లి : కళాశాలలో అడుగుపెడుతున్నామంటే చాలు కొత్త అనుభూతి కలుగుతుంది. కొత్త మిత్రులు పరిచయమవుతుంటారు. స్వేచ్ఛాలోకంలోకి అడుగుపెతున్నామన్న భావన ఏర్పడుతుంది. ఈ తరుణంలో ఉన్నత లక్ష్యాలతో అడుగుపెట్టే కళాశాల విద్యే మన పునాది అన్న విషయం మరచిపోవద్దు. సంకల్పాన్ని నెరవేర్చుకునేందుకు అడుగులు వేయాల్సింది ఇక్కడి నుంచేనన్న ఆలోచన మదిలో గుర్తుంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది.

**నొప్పించక.. తానొవ్వక..**

కొత్తగా కళాశాలలో అడుగుపెట్టిన విద్యార్థులు అందరితో త్వరగా కలిసిపోయే తత్వం ఏర్పరచుకోవాలి. కలివిడి మనస్తత్వాన్ని పెంచుకొని స్నేహం చేస్తే అందులో ఉండే మాధుర్యాన్ని ఆస్వాదించవచ్చు. ముఖ్యంగా నలుగురితో మాట్లాడటానికి, కలవడానికి ఇబ్బందిపడేవారు ఈ అంశంపై దృష్టి సారిస్తే కళాశాల జీవితం సాఫీగా సాగుతుంది. ఏ విషయమైనా ఎదుటివారిని నొప్పించకుండా నేర్పరితనంతో ధైర్యంగా చెప్పడం మేలు.

**అధ్యాపకులే దిక్సూచీ..**

కళాశాలలో నూతనంగా చేరిన విద్యార్థులను అధ్యాపకులు తరచూ పలకరిస్తుండాలి. ఎలాంటి ఇబ్బందులెదురైనా తాము అండగా ఉన్నామన్న భావన కలిగించాలి. చదువులో వెనకబడినప్పుడు వారిపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా అర్థం చేసుకునేలా శ్రద్ధ చూపించాలి. సున్నితంగా ప్రేరణ కలిగించేలా ప్రసంగించాలి. కళాశాల కార్యక్రమాల్లో జూనియర్లను ప్రతిసారీ భాగస్వామ్యం చేస్తుండాలి.

**చెడు వ్యసనం.. భవిష్యత్తు నాశనం**

కళాశాల విద్య సమయంలోనే విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిసలుగా మారే అవకాశముంది. ప్రస్తుతం ప్రతి విద్యార్థి చేతిలో స్మార్ట్‌ఫోన్ కీలకంగా మారింది. దీంతో అనవసరమైన చిత్రాలు చూసే అవకాశం అధికంగా ఉంది. ధూమపానం, మత్తు పదార్థాలు తదితర అలవాట్లకు దూరంగా ఉండాలి. తల్లిదండ్రులు, కళాశాలల యాజమాన్యం విద్యార్థులపై ఓ కన్నేసి ఉంచాలి.

**ప్రవేశాలు మొదలు..**

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ పూర్తికావొస్తుంది. పాలిటెక్నిక్, పీజీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులకు తరగతులూ త్వరలో ప్రారంభం కానున్నాయి.

**అవకాశం వదలొద్దు..**

ఇంటర్ వార్షిక పరీక్షల్లో 90శాతానికి పైగా మార్కులు సాధిస్తే డిగ్రీ ఆపై స్థాయి వరకు ఐదేళ్లపాటు ఏడాదికి రూ.10 వేల చొప్పున విద్యార్థికి ఇంటర్ విద్యా శాఖ వారు ప్రోత్సాహకం అందజేస్తారు. డిగ్రీ చదువుల్లో జిల్లా స్థాయిలో రాణిస్తే రూ.3 వేలు, రాష్ట్ర స్థాయి విశ్వవిద్యాలయాల్లో పీజీ ప్రవేశ పరీక్షలో ర్యాంకు సాధిస్తే, కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో సీటు వస్తే నగదు పురస్కారాలను కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ వారు అందిస్తారు. ఇలాంటి అవకాశాలను వినియోగించుకుంటే ఉన్నత విద్యకు మార్గం సుగమమవుతుంది.

**అందరి సహకారం అవసరం :** మహ్మద్ ఇస్మాయిల్, ప్రిన్సిపల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, నార్కట్పల్లి

అధ్యాపకులు నూతన విద్యార్థులకు స్నేహపూర్వక వాతావరణంలో పాఠ్యాంశాలను బోధించాలి. సీనియర్లు.. జూనియర్లకు ఎలాంటి ఇబ్బందులున్నా మేమున్నామనే భరోసా ఇవ్వాలి. కొత్తగా కళాశాలల్లో అడుగుపెట్టే వారికి సీనియర్లు, అధ్యాపకుల సహకారం ఎంతో అవసరం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపించాలి. ఉమ్మడి నల్గొండ జిల్లాలో..

ప్రభుత్వ జూనియర్ కళాశాలలు: 31

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు: 11

# అనర్హుల గుట్టు.. తనిఖీతో రట్టు

సూర్యాపేట : ప్రభుత్వం ప్రతి నెల ఆసరా పింఛన్లను పంపిణీ చేస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 57 సంవత్సరాలు నిండిన వారికి వృద్ధాప్య పింఛను ఇస్తామని ప్రకటించింది. దీంతో ఈ పింఛను కోసం దరఖాస్తు చేసుకున్న వారు వేలల్లో ఉన్నారు. కాగా ప్రస్తుతం ఆసరా పింఛన్ల పంపిణీలోనూ ఆడిట్ (సామాజిక తనిఖీ) నిర్వహించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేపడుతోంది. అందులో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ మాదిరిగా నిర్వహించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ఈ విధానం ద్వారా అనర్హులను గుర్తించే అవకాశం ఉండటంతో పాటు ప్రజాధనం వృథా కాకుండా ఉండేందుకు వీలుంటుంది.

**దివ్యాంగ, వృద్ధాప్యంలోనే అధికం**

జిల్లా వ్యాప్తంగా 1,45,682 మంది లబ్ధిదారులు ఆసరా పింఛన్లు పొందుతున్నారు. వృద్ధాప్య, దివ్యాంగ, వితంతు, చేనేత, కల్లుగీత, ఒంటరి మహిళా కేటగిరీలకు చెందిన వారితో పాటు హెచ్ఐవీ, బోదకాలు, డయాలసిస్ బాధితులు ఉన్నారు. ప్రధానంగా దివ్యాంగుల, వృద్ధాప్య కోటాలో పింఛను పొందుతున్న వారిలో అనర్హులు అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కొందరు దళారులను ఆశ్రయించి వైకల్యం లేకున్నా సదరం ధ్రువపత్రం పొంది పింఛన్లు తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. మరికొందరు ఆధార్ కార్డులో వయసు ఎక్కువ



వేసుకుని వృద్ధాప్య పింఛన్లు పొందుతున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో తపాలా శాఖ ద్వారా వేలిముద్రలు తీసుకుని అందజేస్తున్నారు. వేలిముద్రలు పడని వారి తరపున పంచాయతీ కార్యదర్శి వేలిముద్ర వేసి అందజేస్తున్నారు. ఇవి సవ్యంగా జరగడం లేదని ప్రభుత్వం భావిస్తోంది. వీటన్నింటి నేపథ్యంలో సామాజిక తనిఖీయే అక్రమాలకు చెక్ పెట్టేందుకు సరైన మార్గమని భావిస్తూ ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తోంది. సామాజిక తనిఖీ ఎలా ఉండాలన్న విషయమై ప్రభుత్వ ఆదేశానుసారం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాధికారులు విధివిధానాల రూపకల్పనలో నిమగ్నమయ్యారు.

ఆదేశాలు రావాల్సి ఉంది.. : అప్పారావు, డీఆర్డీవో, సూర్యాపేట

ఆసరా పింఛన్ల విషయంలో ఆడిట్ నిర్వహించే విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఇప్పటికే వివిధ విభాగాల్లో పింఛను పొందుతున్న వారి వివరాలను ప్రభుత్వానికి నివేదించాం.




అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన సినిమా హరిహర వీరమల్లు విడుదల సందర్భంగా మంత్రులు అభినందనలు తెలిపారు. మంత్రి నారా లోకేష్‌ను ఆలింగనం చేసుకుని కృతజ్ఞతలు చెప్పారు పవన్ కల్యాణ్. కేబినెట్ మీటింగ్ ముందు పవన్‌ను పిలిచి మరీ షేక్ హ్యాండ్ ఇచ్చి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అభినందనలు తెలిపారు. మరో వైపు.. విశాఖపట్నం మద్దిలపాలెంలోని కిన్నెర కామేశ్వరి థియేటర్‌లో ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన హరి హర వీర మల్లు సినిమాను ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ వీక్షించారు. ఈ సందర్భంగా మాధవ్ మీడియాతో మాట్లాడారు. పవన్ కల్యాణ్ డిప్యూటీ సీఎం అయిన తర్వాత వచ్చిన మొదటి సినిమా అద్భుతంగా ఉందని ప్రశంసించారు. పవన్ కల్యాణ్ అద్భుత నటనతో ప్రేక్షకులను కట్టిపడేశారని కొనియాడారు పీవీఎన్ మాధవ్. ప్రేక్షకులను రంజింప చేయడానికే కాకుండా ఆలోచింపచేయడానికి ఈ చిత్రం తీశారని అభివర్ణించారు. ఈ సినిమాలో మల్లయుద్ధం హైలెట్ అని... అన్నివర్గాల ప్రజలను పవన్ కల్యాణ్ మెప్పించారని చెప్పుకొచ్చారు. ఔరంగజేబు చేసిన అకృత్యాలు దాష్టికాలను ఈ చిత్రంలో బాగా చూపించారని కొనియాడారు. జిజియా పన్ను కట్టకపోతే ముస్లిమేతరులను వేధించిన తీరును బాగా చూపించారని ఉద్ఘాటించారు. మత సామరస్యాన్ని దెబ్బతీసిన ఔరంగజేబుపై సినిమా చేయడం చాలా సాహసమని నొక్కిచెప్పారు. భారతదేశ కీర్తి ప్రతిష్టలను నిలబెట్టిన వీరుల కథలను సినిమాగా తీసినందుకు పవన్ కల్యాణ్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని తెలిపారు. ఎంతో కష్టపడి తీసిన ఈ మూవీని ప్రేక్షకులు ఆదరించాలని ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ కోరారు.




## బెయిల్ పిటిషన్ దాఖలు చేసిన మిథున్‌రెడ్డి

విజయవాడ: వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి లాయర్లు ఏసీబీ కోర్టులో ఇవాళ (గురువారం జులై 24) బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. లిక్కర్ స్కాం కేసులో ఏ4గా ఉన్నారు మిథున్‌రెడ్డి.

ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఆయన ఉన్నారు. కాగా, లిక్కర్ స్కాం కేసులో నిందితుల బెయిల్ పిటిషన్లని వాయిదా వేసింది ఏసీబీ కోర్టు. ఈ కేసులో ఏ31 ధనుంజయ రెడ్డి, ఏ32 కృష్ణ మోహన్‌రెడ్డి, ఏ33 బాలాజీ గోవిందప్ప బెయిల్ పిటిషన్లు దాఖలు చేశారు. కౌంటర్ దాఖలు చేయాలని సిట్‌కు ఆదేశాలు జారీ చేశారు న్యాయమూర్తి. తదుపరి విచారణ ఈ నెల(జులై) 29వ తేదీకి ఏసీబీ కోర్టు వాయిదా వేసింది. మరోవైపు.. మద్యం ముడుపుల కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ రంగంలోకి దిగింది. శ్రావణి డిస్టిలరీస్ డైరెక్టర్ చంద్రారెడ్డికి నోటీసులు పంపించారు ఈడీ అధికారులు. PMLA చట్టం కింద కేసు దర్యాప్తు చేస్తున్నారు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్. ఈ నెల (జులై) 28వ తేదీ ఉదయం 10:30 గంటలకు హైదరాబాద్‌లోని తమ కార్యాలయంలో విచారణకు హాజరు కావాలని నోటీసులు ఇచ్చారు. జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఆంధ్రా గోల్డ్ బ్రాండ్ పేరిట భారీగా మద్యం తయారీ చేసినట్లు గుర్తించారు. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ నుంచి ఆంధ్రా గోల్డ్ బ్రాండ్ భారీగా కొనుగోళ్లు చేసినట్లు అధికారుల విచారణలో తేలింది. ఇప్పటికే సిట్, ఈడీ అధికారులు మద్యం కేసుకు సంబంధించి పూర్తి సమాచారం సేకరించారు.

ఇక వరుసగా దర్యాప్తు ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు. ఇప్పటికే సిట్ ప్రిలిమినరీ చార్జిషీట్ వేయడంతో ఇక దర్యాప్తు ప్రారంభించాలని ఈడీ అధికారులు తుది నిర్ణయం తీసుకున్నారు.




అమరావతి: ఏపీలో కీలక మెట్రో ప్రాజెక్టులకు మరో ముందడుగు పడింది. విశాఖపట్నం, విజయవాడ మెట్రో రైలు ప్రాజెక్టులకు శుక్రవారం టెండర్లు పిలవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాజెక్టు వ్యయంలో 40శాతం పనులకు తొలుత టెండర్లు పిలవనుంది. మొత్తం రూ.21,616 కోట్లతో ఈ రెండు ప్రాజెక్టులకు టెండర్లు ఆహ్వానించనున్నారు. విశాఖ మెట్రో రైలుకు రూ.11,498 కోట్లతో, విజయవాడ మెట్రోకు రూ.10,118 కోట్లతో టెండర్లు పిలవనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల 50:50 భాగస్వామ్యంతో ఈ ప్రాజెక్టుల నిర్మాణాలు జరగనున్నాయి.

విశాఖ మెట్రోకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద వీఎంఆర్డీఏ నుంచి రూ.4,101 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. విజయవాడ మెట్రోకు సీఆర్డీఏ నుంచి రూ.3,497 కోట్లు కేటాయించనున్నారు.




రష్యాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. 49 మందితో వెళ్తున్న ఓ ప్రయాణికుల విమానం అమూర్ ప్రాంతంలో కుప్పకూలింది. తొలుత ఈ విమానం అదృశ్యమైనట్లు వార్తలు రాగా.. కాసేపటికే అది కూలిపోయినట్లు అధికారులు నిర్ధరించారు. అంగారా ఎయిర్‌లైన్‌కు చెందిన ఏఎన్-24 విమానం గురువారం ఉదయం బ్లాగోవెష్‌చెన్స్క్ నుంచి చైనా సరిహద్దుల్లో ఉన్న టిండా ప్రాంతానికి బయల్దేరింది. మరికొద్ది సేపట్లో విమానం ల్యాండ్ అవ్వాల్సి ఉండగా.. ఉన్నట్టుండి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్స్‌తో సంబంధాలు తెగిపోయాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఎమర్జెన్సీ సర్వీసెస్‌ను సిద్ధం చేశారు. విమానం కోసం గాలించగా.. గమ్యస్థానానికి కేవలం 15 కిలోమీటర్ల దూరంలో అది కూలిపోయినట్లు గుర్తించారు. ఘటనా స్థలంలో పెద్దఎత్తున మంటలు ఎగిసిపడుతున్నాయి. రెస్క్యూ సిబ్బంది అక్కడికి చేరుకునేందుకు యత్నిస్తున్నారు. ఈ విమానం తొలుత ల్యాండింగ్‌కు ప్రయత్నించగా.. పరిస్థితులు అనుకూలించలేదట. రెండోసారి ల్యాండింగ్ చేసేందుకు ప్రయత్నిస్తుండగా.. రాడార్ నుంచి గల్లంతై కూలినట్లు తెలుస్తోంది. ప్రమాద సమయంలో విమానంలో 43 మంది ప్రయాణికులు, ఆరుగురు సిబ్బంది ఉన్నారు. ప్రయాణికుల్లో ఐదుగురు చిన్నారులు ఉన్నట్లు రష్యన్ మీడియా కథనాలు వెల్లడించాయి. విమానం కూలిన ప్రాంతంలో శకలాలకు సంబంధించిన దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. ఈ ప్రమాదంలో ఎవరూ బతికే అవకాశం లేదని రష్యా అధికారిక మీడియా ఛానల్ ప్రకటించింది. ల్యాండింగ్ సమయంలో వాతావరణం అనుకూలించకపోవడం, పైలట్ తప్పిదం కారణంగానే ప్రమాదం జరిగి ఉండొచ్చని ప్రాథమికంగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

## ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం.. ఉత్తరాంధ్రకు భారీ వర్షసూచన



అమరావతి: ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. రాబోయే 24 గంటల్లో ఇది మరింత బలపడే అవకాశం ఉన్నట్లు ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది.

వచ్చే 48 గంటల్లో పశ్చిమ-వాయవ్య దిశగా ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్ వైపు కదిలే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, కోస్తాంధ్రలో మోస్తరు వర్షాలు కురిసే ఆస్కారం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు తెలిపారు. వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## మద్యం కుంభకోణం కేసు.. సిట్ విచారణకు హాజరైన శ్రవణ్‌రావు



విజయవాడ: మద్యం కుంభకోణం కేసులో శ్రవణ్‌రావు గురువారం సిట్ విచారణకు హాజరయ్యారు. లిక్కర్ స్కామ్‌లో నిందితులు చాణక్యతో పాటు మరికొందరికి దుబాయ్‌లోని తన ఫ్లాట్‌లో ఆశ్రయం కల్పించారనేది ఆయనపై ప్రధాన అభియోగం.

ఈ నేపథ్యంలో వివరాలు తెలుసుకునేందుకు విచారణకు రావాలని సిట్ నోటీసులు జారీ చేసింది. రాజ్‌కెసిరెడ్డితో ఇతనికి ఉన్న సంబంధాలపై కూడా ఆరాతీసే అవకాశముంది. తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ శ్రవణ్‌రావు నిందితుడిగా ఉన్నారు.

## ఇంద్రకీలాద్రిపై ఆషాఢమాసం సారె మహోత్సవం పరిసమాప్తం



విజయవాడ: ఇంద్రకీలాద్రిపై ఆషాఢ మాసం సారె మహోత్సవం గురువారంతో పరిసమాప్తమైంది. నేటి సాయంత్రం వరకు భక్తులు సారె సమర్పించేందుకు దేవస్థానం అధికారులు అవకా శం కల్పించారు. అమావాస్య, ఆషాఢమాసం చివరి రోజు కావడంతో భక్తులు భారీగా ఇంద్రకీలాద్రికి తరలివస్తున్నారు. ఆలయ అర్చకులు, వైదిక కమిటీ సభ్యులు, పండితులు, పరిచారకులు కుటుంబ సమేతంగా అమ్మవారికి సారె సమర్పించారు. వీరికి ఆలయ ఈవో స్వాగతం పలికారు.

అమ్మవారికి సుమారు రూ.4లక్షల విలువ చేసే ఆభరణాన్ని ఆలయ పండితుల తరఫున కానుకగా అందజేశారు. గత రెండు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తుండడంతో కొండ రాళ్లు పడే అవకాశం ఉన్నందున ఘాట్ రోడ్‌లో వాహన రాకపోకలను నియంత్రించారు.




## ఫ్లేవర్డ్ మిల్క్‌పై 5శాతం జీఎస్టీని ఖరారు చేసిన సుప్రీంకోర్టు



దిల్లీ: ఫ్లేవర్డ్ మిల్క్‌పై 5శాతం జీఎస్టీని సుప్రీంకోర్టు ఖరారు చేసింది. హెరిటేజ్ ఫుడ్స్‌కి వ్యతిరేకంగా దాఖలు చేసిన పిటిషన్‌ను న్యాయస్థానం కొట్టివేసింది. ఏపీ హైకోర్టుతో పాటు వివిధ రాష్ట్రాల హైకోర్టులు ఇచ్చిన తీర్పులను సవాలు చేస్తూ వేసిన పిటిషన్‌ను తోసిపుచ్చింది. ఫ్లేవర్డ్ మిల్క్‌పై 12శాతం జీఎస్టీ విధించడంపై గతంలో హెరిటేజ్ ఫుడ్స్ హైకోర్టును ఆశ్రయించింది. ఫ్లేవర్డ్ మిల్క్ కూడా పాలు, క్రీమ్ కేటగిరీలోకి వస్తుందని.. అందుకు 5 శాతం జీఎస్టీ మాత్రమే వర్తిస్తుందని ఈ ఏడాది జనవరి 29న ఏపీ హైకోర్టు తీర్పు ఇచ్చింది. కేంద్రం దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన జస్టిస్ పంకజ్ మిత్తల్, జస్టిస్ ప్రసన్న బి. వరాలే ధర్మాసనం.. ఏపీ హైకోర్టు తీర్పును సమర్థించింది. కేంద్రం ప్రతిపాదించిన 12 శాతానికి బదులుగా 5శాతం జీఎస్టీని ఖరారు చేస్తూ ఆదేశాలు జారీచేసింది.

## ‘వీరమల్లు’ ఆన్ డ్యూటీ..

### అటు సినిమా రిలీజ్.. ఇటు కేబినెట్ సమావేశంలో ప్రత్యక్షం

పవర్‌స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన ‘హరిహర వీరమల్లు’ సినిమా నేడు (జులై 24) ప్రపంచవ్యాప్తంగా రిలీజైంది. బుధవారం రాత్రే తెలుగు రాష్ట్రాల్లో ప్రీమియర్ షోలు వేయగా ఫ్యాన్స్ హంగామా చేశారు. థియేటర్ల వద్ద బాణాసంచా కాలుస్తూ పండగ వాతావరణాన్ని క్రియేట్ చేశారు. సినిమాని అందరికంటే ముందే చూడాలన్న ఉత్సాహం నెలకొని ఉండటంతో ప్రీమియర్ షోలకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ప్రీమియర్ షోల ద్వారా బ్లాక్‌బస్టర్ కొట్టేశామంటూ చిత్ర యూనిట్ ట్వీట్ చేసింది. ఈ షోల ద్వారా రూ.20-25 కోట్ల వరకు కలెక్షన్స్ రావొచ్చని అంచనా వేస్తున్నారు. అది పవన్ కళ్యాణ్ కెరీర్లోనే ఓ రికార్డుగా చెపొచ్చు.

ఇక గురువారం ఉదయం నుంచి మామూలు షోలు ప్రారంభం కాగా బుక్కింగ్స్ బాగానే ఉన్నాయి. ఆన్‌లైన్‌తో పాటు ఆఫ్‌లైన్ టిక్కెట్లు కూడా బాగానే తెగుతున్నట్లు టాక్. దీంతో ‘హరిహర వీరమల్లు’ పవన్ సినిమాల్లోకెల్లా ఫస్ట్ డే హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలవడం ఖాయంగా కనిపిస్తోంది. ‘హరిహర వీరమల్లు’ సినిమా అద్భుతంగా ఉందని ఫ్యాన్స్ సంబరాలు చేసుకుంటున్నారు. పవన్ యాక్టింగ్, కీరవాణి మ్యూజిక్, యాక్షన్ సీక్వెన్స్ అదిరిపోయాయని, బొమ్మ బ్లాక్‌బస్టర్ అని చెబుతున్నారు. వీఎఫ్ఎక్స్ మీద ఇంకాస్త ఫోకస్ పెడితే ఇంకా అదిరిపోయేదంటున్నారు. మరోవైపు ఈ చిత్రానికి నెగిటివ్ టాక్ కూడా స్ప్రెడ్ అవుతోంది. సినిమా ఫస్టాఫ్ బాగుంది గానీ, సెకండాఫ్ చెత్తగా ఉందని, మరీ చిన్నపిల్లలు తీసినట్లుగా ఉందని అంటున్నారు. మరోవైపు సోషల్‌మీడియాలో కొందరు డిజాస్టర్ హరిహర వీరమల్లు అని కామెంట్లు పెట్టడంతో పాటు ఆ హ్యాష్‌ట్యాగ్‌ని ట్రెండింగ్‌లోకి తీసుకొచ్చేందుకు నానాపాట్లు పడుతున్నారు. అయితే ‘హరిహర వీరమల్లు’ హిట్టా, ఫ్లాపా.. తొలిరోజు ఎన్నికోట్ల కలెక్షన్లు వసూలు చేస్తుంది.. లాంగ్‌రన్‌లో ఎంత కలెక్ట్ చేస్తుంది.. ఇలా అందరూ ఈ సినిమా గురించి మాట్లాడుకుంటుంటే హీరో పవన్ కళ్యాణ్ మాత్రం అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తుతూ తన పని తాను చేసుకుని పోతున్నారు. గురువారం నాడు అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరగ్గా పవన్ కళ్యాణ్ అక్కడ ప్రత్యక్షమయ్యారు. ఓ పక్క తన సినిమాని ఎప్పుడెప్పుడు చూద్దామా అని ప్రేక్షకులు ఎదురుచూస్తుంటే పవన్ కళ్యాణ్ మాత్రం ఏపీ డిప్యూటీ సీఎం పాత్రలోకి మారిపోయి కేబినెట్ సమావేశానికి అటెండ్ అయ్యారు. ఇందుకు సంబంధించి ఫోటో ప్రస్తుతం వైరల్ అవుతోంది. సినిమా రిలీజ్ పేరుతో మంత్రివర్గ సమావేశానికి హాజరుకావడం పవన్‌లోని క్రమశిక్షణని తెలియజేస్తోందని పలువురు కామెంట్ చేస్తున్నారు.

## పోలవరం వద్ద గోదావరికి పెరుగుతున్న వరద

**పోలవరం: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరికి పెద్దఎత్తున వరద వచ్చి చేరుతోంది. ఏలూరు జిల్లా పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద గురువారం ఉదయానికి నీటిమట్టం 28.160 మీటర్లకు చేరింది. 48 రేడియల్ గేట్ల ద్వారా 2,03,832 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పోలవరం మండలం పట్టిసీమ వద్ద గోదావరిపై నిర్మించిన ఎత్తిపోతల పథకం ద్వారా కుడికాలువకు నీటి సరఫరాను జలవనరుల శాఖ అధికారులు నిలిపివేశారు.**



# చార్మీ.. చాలా రోజుల తరువాత ఇలా..

టాలీవుడ్‌లో ఒకప్పుడు గ్లామరస్ హీరోయిన్‌గా వెలుగొందిన చార్మీ కౌర్, చాలా రోజుల తర్వాత తన ఫోటోను సోషల్ మీడియాలో షేర్ చేసింది. తన 38వ పుట్టినరోజు సందర్భంగా ఆమె ఈ ఫోటోను అప్‌లోడ్ చేసింది. చార్మీ ఈ ఫోటోలో ఎప్పటిలాగే అందంగా, ఎనర్జిటిక్‌గా కనిపించింది, ఆమె స్టైల్ అందరినీ ఆకర్షించింది. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, అభిమానుల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.అనుకోకుండా ఒక రోజు', 'లక్ష్మి' సినిమాలతో ఒకప్పుడు హీరోయిన్‌గా టాలీవుడ్‌లో స్టార్‌డమ్ సంపాదించిన చార్మీ, 2015 తర్వాత నటనకు దూరమైంది. ఆమె నిర్మాతగా మారి, పూరి జగన్నాథ్‌తో కలిసి పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పలు సినిమాలను నిర్మించింది. నిర్మాతగా ఆమె విజయవంతమైన ప్రయాణం సాగుతున్నప్పటికీ, ఆమె నటనను మిస్ అవుతున్నామని అభిమానులు అంటున్నారు. చార్మీ చివరిసారిగా 2015లో 'మంత్ర 2' సినిమాతో నటిగా కనిపించింది. ఆ తర్వాత నటనకు పూర్తిగా



దూరమై, నిర్మాణంపై దృష్టి సారించింది. అయితే, ఆమెకు ఇప్పటికీ నటనకు సంబంధించిన అవకాశాలు వస్తున్నాయని, కానీ ఆమె వాటిని సున్నితంగా తిరస్కరిస్తోందని సమాచారం. నిర్మాతగా ఆమె బిజీ షెడ్యూల్, కొత్త కథలపై ఫోకస్ ఆమెను నటనకు దూరంగా ఉంచుతున్నాయని టాక్. ఈ సందర్భంగా చార్మీ పుట్టినరోజు ఫోటో అభిమానులకు సర్‌ప్రైజ్‌గా నిలిచింది. ఆమె ఈ ఫోటోలో బ్లాక్ అండ్ వైట్ డ్రెస్‌లో అద్భుతంగా కనిపించింది, ఆమె అందం, స్టైల్ అందరినీ ఆకట్టుకుంది. "చార్మీ ఎప్పటిలాగే అద్భుతంగా ఉంది, మళ్లీ నటించాలని కోరుకుంటున్నాం" అని అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. ఈ ఫోటో ఆమె పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ఓ చిన్న ట్రీట్‌గా నిలిచింది. చార్మీ నిర్మాతగా తన దృష్టిని కొనసాగిస్తున్నప్పటికీ, ఆమె నటనకు తిరిగి రావాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఆమె ఎనర్జిటిక్ పర్ఫామెన్స్‌లు, స్క్రీన్ ప్రెజెన్స్ ఇప్పటికీ అభిమానుల మదిలో నిలిచి ఉన్నాయి. ఆమె త్వరలో నటనలోకి రీఎంట్రీ ఇస్తుందా అనేది ఆసక్తికరంగా మారింది. ఇక నెక్స్ట్ నిర్మాతగా ఆమె విజయ్ సేతుపతి పూరి కాంబినేషన్ కోసం సిద్ధం అవుతున్నారు.

# బిడ్డొచ్చిన వేళ స్టార్ హీరోకి కలిసొచ్చేనా?

కియరా అద్వానీ లాంటి ట్యాలెంటెడ్ నటిని ప్రేమించి పెళ్లాడాడు సిద్ధార్థ్ మల్హోత్రా. అయితే పెళ్లి తర్వాత ఎందుకనో సిద్ధార్థ్ కి సరైన హిట్టు పడలేదు. ఇటీవలే కియరా కు డెలివరీ అయ్యింది. అయితే ఇకపై అతడి కెరీర్ గ్రాఫ్ లో ఛేంజ్ అనూహ్యంగా ఉంటుందని అభిమానులు ఊహిస్తున్నారు. తన భార్య తనకు బిడ్డను ఇచ్చే లోపే అతడు మరో బంపర్ హిట్టు కొట్టాలని కసితో ఉన్నాడట. తదుపరి మల్హోత్రా ప్రయోగాత్మక చిత్రంలో నటించనున్నాడు. కోటా ఫ్యాక్టరీ, పంచాయత్ వంటి ఐకానిక్ సిరీస్‌లను కొనుగోలు చేసిన టివిఎఫ్ స్టూడియో ఇప్పుడు సిద్ధార్థ్ మల్హోత్రా ప్రధాన పాత్రలో వ్వాన్: ఫోర్స్ ఆఫ్ ది ఫారెస్ట్



అనే జానపద థ్రిల్లర్‌ను తెరకెక్కించనుంది. దీనికి దీపక్ మిశ్రా దర్శకుడు. అద్భుత కథల ఎంపికలతో టివిఎఫ్ ఇప్పటికే అందరి దృష్టిని ఆకర్షించింది. కోటా ఫ్యాక్టరీ, పంచాయత్ లాంటి వైవిధ్యమైన సిరీస్ లతో ప్రజల దృష్టిని ఆకర్షించిన టీవీఎఫ్ మరో వైవిధ్యమైన స్క్రిప్టుతో విజయం కోసం ఎదురు చూస్తున్న సిద్ధార్థ్ లోటును భర్తీ చేస్తుందని భావిస్తున్నారు. టీవీఎఫ్ తో పాటు ఏక్తా కపూర్ బాలాజీ టెలీఫిలింస్ ఇందులో పెట్టుడులు పెడుతుంది. సిద్ కి షేర్షా తర్వాత సరైన హిట్ లేదు. థాంక్ గాడ్, యోధ కూడా ఆశించిన విజయాలను సాధించలేదు. కానీ ఇప్పుడు బిడ్డొచ్చే వేళ మంచి హిట్టొస్తుందని ఆశిస్తున్నాడు. అది వ్వాన్ తో సాధ్యమవుతుందని అభిమానులు భావిస్తున్నారు. జాన్వీతో పరమ్ సుందరి కూడా సిద్ధార్థ్ కి విజయాన్ని అందించాల్సి ఉంటుంది.




# యాక్షన్ లో కమల్-సింబు రణం!




కమల్ హాసన్, మణిరత్నం కాంబినేషన్ అంటే ఎప్పుడూ ఓ ప్రత్యేక ఆకర్షణ ఉంటుంది. దశాబ్దాల తర్వాత వీరిద్దరూ మళ్లీ కలిసి 'థగ్ లైఫ్' సినిమాతో రాబోతున్నారు, ఈ చిత్రం జూన్ 5న విడుదల కానుంది. రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్, మద్రాస్ టాకీస్, రెడ్ జైంట్ మూవీస్ సంయుక్త నిర్మాణంలో రూపొందిన ఈ సినిమా ట్రైలర్ విడుదలై, అభిమానులను ఆకర్షించింది. ఈ ట్రైలర్ యాక్షన్, ఎమోషన్, డ్రామాతో మణిరత్నం మార్క్ కు తగ్గట్లే ఉంది. ట్రైలర్‌లో గ్యాంగ్‌స్టర్ రాజకీయాలు, వ్యక్తిగత పునరాగమనం నేపథ్యంలో కమల్ హాసన్, సింబు మధ్య బలమైన బంధాన్ని చూపించారు. కమల్ హాసన్ ఒక సీనియర్ గ్యాంగ్‌స్టర్‌గా, సింబు ఆయన శిష్యుడిగా కనిపిస్తారు. గురు-శిష్యుల సంబంధంగా మొదలైన ఈ బంధం, క్రమంగా ఒక డెడ్లీ రైవలరీగా మారుతుంది. కమల్ హాసన్ తన లెగసీ, ప్రతీకారం మధ్య సంఘర్షణలో మాగ్నెటిక్‌గా కనిపిస్తే, సింబు తన గురువును సవాలు చేసే యువకుడిగా ఇంటెన్స్ ఎమోషన్స్‌తో ఆకట్టుకున్నాడు. మణిరత్నం సిగ్నేచర్ స్టైల్ ఈ ట్రైలర్‌లో స్పష్టంగా కనిపిస్తుంది. ఎలిగెంట్ అయినప్పటికీ రా ఎమోషన్స్‌తో నిండి ఉంది. ఏఆర్ రహమాన్ బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ యాక్షన్‌కు, ఎమోషన్స్‌కు ఊపిరిలా మారింది. రవి కె. చంద్రన్ సినిమాటోగ్రఫీ అద్భుతమైన ఫ్రేమ్‌లతో కథలోని గ్రాండ్‌నెస్, గ్రిట్‌ను అద్భుతంగా బంధించింది. ట్రైలర్‌లోని ప్రతి షాట్ సినిమాటిక్ బ్యూటీని, ఎమోషనల్ డెప్త్‌ను చూపిస్తోందని అభిమానులు అంటున్నారు. ట్రైలర్‌లో కమల్ హాసన్ ఒక గ్యాంగ్‌స్టర్‌గా తన సామ్రాజ్యాన్ని కాపాడుకునే క్రమంలో చూపించిన ఇంటెన్సిటీ అద్భుతంగా ఉంది. సింబు క్యారెక్టర్ ఎదుగుదల, గురువుతో సంఘర్షణ సన్నివేశాలు హైలైట్‌గా నిలిచాయి. త్రిష, జోజు జార్జ్, అలీ ఫజల్, పంకజ్ త్రిపాఠి వంటి నటులు కూడా ట్రైలర్‌లో కనిపించి, సినిమాపై అంచనాలను పెంచారు. ఈ సినిమా భారీ స్క్రీన్‌పై చూడాల్సిన యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఉంటుందని టాక్ నడుస్తోంది. సినిమా రిలీజ్‌కు రెండు వారాల ముందు ఈ ట్రైలర్‌తో ప్రమోషన్స్ జోరందుకున్నాయి. ట్రైలర్‌లోని యాక్షన్ సీక్వెన్స్‌లు, ఎమోషనల్ మూమెంట్స్ అభిమానులను థియేటర్‌లో ఓ ఫైరీ షోడౌన్‌ను ఆశించేలా చేశాయి. మణిరత్నం స్టైలిష్ డైరెక్షన్, కమల్-సింబు కెమిస్ట్రీ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మొత్తంగా, 'థగ్ లైఫ్' ట్రైలర్ సినిమాపై అంచనాలను రెట్టింపు చేసింది. ఇక జూన్ 5న ఈ సినిమా ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

# వారికి చుక్కలు చూపిస్తున్న డిజిటల్ ప్లాట్‌ఫామ్స్!



కరోనా మహమ్మారి కారణంగా ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు మంచి క్రేజ్ ఏర్పడింది. నచ్చిన సినిమాలు, సిరీస్‌లు థియేటర్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఉండి చూసే ఫెసిలిటీ ఉండటంతో చాలా వరకు ప్రేక్షకులు ఓటీటీలకు ఎడిక్ట్ కావడం మొదలైంది. దీంతో సినిమాలు, సిరీస్‌లని భారీ స్థాయిలో కొనడం ప్రారంభించిన ఓటీటీ ప్లాట్ ఫామ్‌లు వాటి ప్రవాహం భారీగా పెరగడంతో క్రమ క్రమంగా సినిమాలు, సిరీస్‌లని కొనడం తగ్గించి మేకర్స్‌కు షాక్ ఇవ్వడం మొదలు పెట్టాయి. కేవలం స్టార్ హీరోలు, స్టార్ ప్రొడక్షన్ కంపనీలు నిర్మించిన సిరీస్‌లు, సినిమాలకు మాత్రమే ప్రాధాన్యతనిస్తూ కొత్త మేకర్స్‌ని పక్కన పెడుతుండటంతో చాలా వరకు మేకర్స్ తీవ్ర ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్నారు. అంతకు ముందు డిజిటల్ రైట్స్ కోసం భారీ మొత్తాన్ని అందించి చాలా వరకు నిర్మాతలకు లాభాల్ని అందించి సిరీస్‌లు, ఓటీటీ మూవీస్‌కు ఊతం ఇచ్చిన ఓటీటీలు ఇప్పుడు కేవలం సెలక్టీవ్‌గా సినిమాలు, సిరీస్‌లని మాత్రమే కొంటూ మిగతావారికి చుక్కలు చూపిస్తున్నాయి. తక్కువ బడ్జెట్‌లో ఓ మోస్తారు పేరున్న నటీనటులతో నిర్మించిన వాటికి పెద్దగా ఇంపార్టెన్స్ ఇవ్వడం లేదు. దీంతో చిన్న సినిమాలు, సిరీస్‌లు నిర్మిస్తున్న మేకర్స్ ఇబ్బందులకు గురవుతున్నారు. అంతే కాకుండా ఈ మధ్య డిజిటల్ ప్లాట్ పామ్స్ కొత్త పద్ధతిని కూడా అనుసరిస్తున్నాయి. చాలా మంది సినిమాలు తీసివాటిని థియేటర్లలో రిలీజ్ చేసుకునే వీలు, డబ్బులు లేకపోవడంతో ఓటీటీలని ఆశ్రయిస్తున్నారు. అలా తీసుకొచ్చిన సినిమాలని పే పర్ వ్యూ పద్ధతిలో తీసుకుంటూ కొత్త తరహాలో ఇబ్బందులకు గురి చేస్తున్నారని పలువురు మేకర్స్ వాపోతున్నారు. చిన్న బడ్జెట్ సినిమాల నిర్మాతలకు తమ చిత్రాలని థియేటర్లలో రిలీజ్ చేయడానికి సరిపడా డబ్బులు ఉండటం లేదు. అంతే కాకుండా పబ్లిసిటీకి బడ్జెట్ కేటాయించలేకపోతున్నారు. దీంతో ఓటీటీలు కూడా ఈ సినిమాలని తీసుకోవడానికి ముందుకు రావడం లేదు. దీంతో దాదాపు 300 సినిమాలు ప్రస్తుతం రిలీజ్‌కు నోచుకోక పీకల్లోతు కష్టాల్ని ఎదుర్కొంటున్నాయని ఇన్ సైడ్ టాక్. శాటిలైట్ మార్కెట్ కూడా వీరికి డోర్లు క్లోజ్ చేయడంతో చిన్న సినిమాలు నిర్మించిన నిర్మాతలంతా ఇప్పుడు తలలు పట్టుకుంటున్నారట. ఇది ఇప్పుడు టాలీవుడ్‌లో ప్రధాన సమస్యగా మారిందని ఇండస్ట్రీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# థై స్లిట్ లెహంగాలో మీనాక్షి కిల్లర్ ఫోజ్

అందానికి అందం ప్రతిభ రెండూ ఉంటే స్కై ఈజ్ లిమిట్ అన్న చందంగా ఎదిగేందుకు ఛాన్సుంది. గ్లామ్ అండ్ గ్లిజ్ ప్రపంచంలో నేటితరం నటీమణులు దూసుకెళుతున్నారు. మునుపటితో పోలిస్తే పెద్దతెర, ఓటీటీ తెరపై ప్రయోగాత్మక కథలు తెరకెక్కుతున్నాయి. దానికి తగ్గట్టే నటీమణులకు కూడా నటించేందుకు స్కోప్ పెరిగింది. ఆ కోవలో చూస్తే నేటితరం హీరోయిన్ మీనాక్షి చౌదరి తదుపరి నటనకు ఆస్కారం ఉన్న పాత్రలలో అవకాశం అందుకుంటోంది. ఈ సంవత్సరం ప్రారంభంలో మీనాక్షి చౌదరి సంక్రాంతికి వస్తున్నాం సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ సాధించింది. ఆ తర్వాత వరుస సినిమాలతో బిజీ అయిపోయింది. మీనాక్షి తదుపరి అనగనగ ఒక రాజులో నవీన్ పోలిశెట్టితో కలిసి కనిపించనుంది. తాజా కథనాల ప్రకారం, మీనాక్షి




బాలీవుడ్‌లోకి అడుగుపెట్టడానికి సిద్ధమవుతోంది. స్త్రీ 2 నిర్మాత దినేష్ విజన్ సినిమాలో కీలక పాత్రను పోషించే అవకాశం ఉందని కథనాలొచ్చాయి. మాడాక్ ఫిల్మ్స్ మీనాక్షి కోసం ఒక స్క్రిప్ట్‌ను సిద్ధం చేస్తోంది. ఇందులో హీరో ఎవరో ఇంకా వెల్లడించాల్సి ఉంది. మరోవైపు మీనాక్షి సోషల్ మీడియాల్లో తన ఫాలోవర్స్ ని నిరాశపరచడం లేదు. వరుసగా క్రేజీ మ్యాగజైన్ కవర్ షూట్లతోను మీనాక్షి అభిమానులను అలరిస్తోంది. తాజాగా ఫేస్ మ్యాగజైన్ కవర్ పేజీ కోసం అద్భుతమైన ట్రెడిషనల్ లెహంగాలో దర్శనమిచ్చింది. అయితే ఇది చూడటానికి సాంప్రదాయబద్ధంగా కనిపించినా థై స్లిట్ ఎలివేషన్ తో మోడ్రన్ టచ్ ని మీనాక్షి చూపించింది. డిజైనర్ బ్లౌజ్, ఇన్నర్ అందాలను తాకుతూ దుపట్టా, బాటమ్ లో థై స్లిట్ ఎలివేషన్ ప్రతిదీ దేనికదే ప్రత్యేకం. ది ఆర్ట్ ఆఫ్ బికమింగ్: మీనాక్షి రీన్ ఆఫ్ రీఇన్వెన్షన్ పేరుతో సరికొత్త కవర్ స్టార్‌గా మీనాక్షిని ఫేస్ మ్యాగజైన్ ప్రెజెంట్ చేస్తోంది. నేటి జెన్ జెడ్ హీరోయిన్ మీనాక్షి కొత్త లుక్ ఇప్పుడు ఇంటర్నెట్ లో వైరల్ గా దూసుకెళుతోంది.

# ఫైనల్‌గా శ్రీవిష్ణు తనకు లక్కీ ఛార్మ్ అయ్యాడుగా!

సినీ ఇండస్ట్రీలో ఎప్పుడు ఎవరి కెరీర్ ఎలాంటి మలుపు తీసుకుంటుందో ఎవరూ చెప్పలేరు. రాత్రికి రాత్రే బ్లాక్ బస్టర్లని దక్కించుకుని స్టార్‌డమ్‌ని సొంతం చేసుకున్న వాళ్లున్నారు. ఎన్నేళ్లైనా ఒక్క హిట్ దక్కని వారూ ఉన్నారు. కొంత మంది రెండు మూడు సినిమాల తరువాత సక్సెస్ బాటపడితే కొంత మంది మాత్రం ఆ సక్సెస్ కోసం వేచి చూడాల్సిన పరిస్థితి. గత కొన్నేళ్లుగా ఇలాంటి పరిస్థితినే ఎదుర్కొంది హాట్ లేడీ కేతిక. తను కెరీర్ ప్రారంభించి నాలుగేళ్లవుతోంది. పూరి జగన్నాథ్ తనయుడు ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ మూవీతో హీరోయిన్‌గా కెరీర్ ప్రారంభించిన ఈ ఢిల్లీ సోయగం అంతకు ముందు డబ్‌స్మాష్ వీడియోలతో పాపులర్ అయింది. అదే పాపులారిటీ కారణంగా పూరి దృష్టిలో పడిన కేతిక రొమాంటిక్ మూవీతో నటించే అవకాశాన్ని దక్కించుకుంది. హీరోయిన్‌గా తనకిదే తొలి సినిమా. ఇది తనకు ఆశించిన విజయాన్ని



అందించలేకపోయింది. కావాల్సిన గ్లామర్ ఉన్నా, ఎక్స్ పోజింగ్‌కు ఎలాంటి అభ్యంతరం చెప్పలేకపోయినా కానీ తనని విజయం వరించలేదు. ఆతరువాత చేసిన లక్ష్య, రంగరంగ వైభవంగ, బ్రో వంటి సినిమాలు కేతికకు విజయాన్ని అందించలేకపోయాయి. కెరీర్ ప్రారంభించి నాలుగేళ్లు కావస్తున్నా కేతికకు సక్సెస్ అందని ద్రాక్షగా మారి దోబూచులాడుతోంది. సక్సెస్ కోసం నాలుగేళ్లుగా ఎదురు చూస్తున్న కేతిక కల హీరో శ్రీవిష్ణు కారణంగా తాజాగా నెరవేరింది. శ్రీవిష్ణుతో కలిసి కేతిక నటించిన లేటెస్ట్ మూవీ సింగిల్. మే 9న విడుదలైన ఈ సినిమా ఫస్ట్ డే ఫస్ట్ షో నుంచే సూపర్ హిట్ టాక్‌ని సొంతం చేసుకుంది. ఇప్పటి వరకు ఈ సినిమా రూ. 15 కోట్లు రాబట్టి బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. కెరీర్ ఇక కష్టమేనా అనుకున్న సమయంలో కేతికకు హిట్ ఇచ్చిన శ్రీవిష్ణు ఆమె కెరీర్‌కు ప్లస్ అయ్యాడు. ఆమె పాలిట లక్కీ ఛార్మ్‌గా మారాడు.

దీంతో కేతిక కెరీర్ కొత్త మలుపు తిరిగింది. ఈ సినిమా తరువాత కేతిక క్రేజ్ పెరుగుతుందని, వరుసగా క్రేజీ ప్రాజెక్ట్‌లు తనని వరిస్తాయని ఇండస్ట్రీ వర్గాలు అంటున్నాయి. అన్నట్టుగా కేతిక సింగిల్ తరువాత తమిళ దర్శకుడు రాజేష్ ఎం. సెల్వ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తోంది. ప్రస్తుతం షూటింగ్ దశలో ఉన్న ఈ సినిమా త్వరలోనే తమిళ, తెలుగు భాషల్లో రిలీజ్ కాబోతోంది.




## భారీ వర్షాలు.. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కోవాలి: సీఎం రేవంత్ ఆదేశం

దిల్లీ: తెలంగాణలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికార యంత్రాంగాన్ని సీఎం రేవంత్‌రెడ్డి అప్రమత్తం చేశారు. దిల్లీ పర్యటనలో ఉన్న సీఎం.. అక్కడి నుంచే సీఎంవో అధికారులతో మాట్లాడారు. అన్ని జిల్లా కలెక్టర్లు, వివిధ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసేలా దిశానిర్దేశం చేయాలని ఆదేశించారు. "లోతట్టు ప్రాంతాల్లో సహాయక చర్యలు చేపట్టాలి. నీటి ఉద్ధృతి ఉన్న ప్రాంతాల్లో ప్రజలను అప్రమత్తం చేయాలి. ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. ఎలాంటి పరిస్థితులు వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి. ప్రజలకు సాయం చేసేందుకు అధికారులు జిల్లాల్లోనే అందుబాటులో ఉండాలి" అని సీఎం రేవంత్ ఆదేశించారు.




**తన పుట్టిన రోజు సందర్భంగా భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్.. తన తల్లిదండ్రులు కేసీఆర్, శోభ ఆశీర్వాదం తీసుకున్నారు. వారి కాళ్లకు ఆయన నమస్కరించారు. మరోవైపు తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య కేటీఆర్ కేక్ కట్ చేశారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి ఆయనకు బర్త్‌డే విషెస్ తెలిపారు.**

## ఫిన్‌టెక్, స్మార్ట్ మొబిలిటీ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా ఫ్యూచర్ సిటీ: మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్: తెలంగాణ ఆర్థిక వ్యవస్థను 2047 నాటికి 3 టిలియన్ డాలర్లకు చేర్చడమే ప్రభుత్వ సంకల్పమని, ఈ లక్ష్య సాధనలో పాలుపంచుకోవాలని యూఏఈ పారిశ్రామికవేత్తలను రాష్ట్ర ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కోరారు. హెచ్‌ఐసీసీలో యూఏఈ, రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న 'ఇన్వెస్టోపియా గ్లోబల్' అంతర్జాతీయ పెట్టుబడుల సదస్సును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. భౌగోళికంగా చిన్నదైనా.. ఆశయాలు, ఆచరణలో తెలంగాణ చాలా పెద్దదని అన్నారు. "2024 – 25లో జీఎస్‌డీపీలో 8.2 శాతం వృద్ధి నమోదైంది. ఇది జాతీయ సగటు కంటే ఎక్కువ. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 5 శాతానికి పైగా ఉంది. రాష్ట్రంలో డ్రై పోర్ట్‌లు, మల్టీమోడల్ లాజిస్టిక్స్ పార్కులు, పారిశ్రామిక కారిడార్ల విస్తరణకు ప్రణాళికలు రూపొందించాం. నెట్–జీరో పారిశ్రామిక పార్కులు, ఈవీ జోన్లు, గ్రీన్ లాజిస్టిక్ హబ్‌లు, రీజినల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్), మెట్రో ఫేజ్ - 2 వంటి ప్రాజెక్టులు పారిశ్రామికాభివృద్ధికి మరింత ప్రోత్సాహం ఇవ్వనున్నాయి. అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయబోతున్న ఫ్యూచర్ సిటీ.. ఫిన్‌టెక్, క్లైమేట్–టెక్, స్మార్ట్ మొబిలిటీ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా మారబోతోంది. డేటా సెంటర్లు, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్లు, ఏఐ ల్యాబ్‌లు, ఏరోస్పేస్ క్లస్టర్లలో వేగవంతమైన వృద్ధి నమోదవుతోంది. ఏడాదన్నర వ్యవధిలో కొత్తగా 3.2 లక్షల కోట్లకు



పైగా పెట్టుబడులను ఆకర్షించాం. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో యూఏఈకి తెలంగాణ ఎగుమతులు 2.5 రెట్లు పెరిగాయి. ఇందులో ఫార్మా, ఏరోస్పేస్, డిజిటల్ సేవలు, ఫుడ్ ప్రాసెసింగ్ కీలక పాత్ర పోషించాయి. ఇప్పటికే యూఏఈకి చెందిన లులు గ్రూప్, డీపీ వరల్డ్, నాఫ్కో వంటి కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టాయి. మరింత మంది పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలి. యూఏఈ మాదిరిగానే తెలంగాణ కూడా సమయం, నమ్మకం, పరివర్తనకు విలువ ఇస్తుంది. ఇక్కడ ఏఐ, లైఫ్ సైన్సెస్, గ్రీన్ హైడ్రోజన్, లాజిస్టిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆగ్రో ఎగుమతులు, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయి" అని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు.

## తెలంగాణలో రెండు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్: ఉత్తర బంగాళాఖాతం మధ్య ప్రాంతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా తెలంగాణలో ఇవాళ, రేపు భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. అన్ని జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని, అక్కడక్కడ ఉరుములు మెరుపులు, ఈదురు గాలులతో కూడిన భారీ వాన పడుతుందని పేర్కొంది. ఇవాళ(గురువారం) జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందంటూ.. ఆయా జిల్లాలకు వాతావరణ శాఖ ఎల్లో అలర్ట్ జారీ చేసింది. శుక్రవారం ఆదిలాబాద్, కుమురంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం,



ఖమ్మం, వరంగల్, హనుమకొండ, జనగాం, మెదక్, కామారెడ్డి జిల్లాలకు భారీ వర్ష సూచన ఉందని, గంటకు 30 నుంచి 40కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొంటూ.. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.




ఒక్కోసారి చిన్న చిన్న పొరపాట్లే.. భారీ కుంభకోణాలను, దొంగతనాలను బయటపెడుతుంటాయి. కర్ణాటకలోని కలబురిగిలో ఇదే తరహా ఘటనే చోటు చేసుకుంది. పావ్‌భాజీ తినాలన్న కోరిక.. దాదాపు రూ.2.15 కోట్ల దొంగతనాన్ని బయటపెట్టింది. జులై 11న జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు తాజాగా వెల్లడించారు. కలబురిగిలోని మారాతుల్లా మాలిక్‌కు చెందిన బంగారు దుకాణంలో పట్టపగలే నలుగురు వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ప్రధాన సూత్రధారి ఫరూక్ అహ్మద్ మాలిక్ దుకాణం బయట గమనిస్తుండగా.. మిగతా ముగ్గురూ మాస్కులు ధరించి లోపలికి వెళ్లి.. యజమాని కాళ్లు, చేతులు కట్టేసి.. తుపాకీతో బెదిరించి బలవంతంగా లాకర్ ఓపెన్ చేయించారు. డబ్బు, బంగారంతో అక్కడి నుంచి పరారయ్యారు.

**పట్టించిన పావ్ భాజీ!...** మారాతుల్లా మాలిక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు, ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. దుకాణం ముందున్న సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. లోపలి నుంచి వచ్చిన ముగ్గురు నిందితులు, బయట ఉన్న ఫరూక్ అహ్మద్ దగ్గరికి వచ్చి.. ఏదో మాట్లాడారు. అక్కడి నుంచి నలుగురూ కలిసి వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్లిన ఫరూక్ మళ్లీ వెనక్కి వచ్చి ప్లేట్ పావ్‌బాజీ తిన్నాడు. దుకాణదారుకు రూ.30 ఫోన్‌పే చేశాడు. అదే అతడిని పట్టించింది. ఆ లావాదేవీ ద్వారా ఫోన్ నెంబర్‌ను గుర్తించిన పోలీసులు.. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా.. దాదాపు 3 కిలోల బంగారం, కొంత నగదును దొంగిలించినట్లు అంగీకరించాడు. అయితే.. పోలీసులు మళ్లీ తన దుకాణంపైనే సోదాలు నిర్వహిస్తారేమోన్న భయంతో కేవలం 805 గ్రాముల బంగారం, కొంత నగదు పోయినట్లు మారాతుల్లా ఫిర్యాదు చేశారని పోలీసులు తెలిపారు. అతడిని కూడా విచారిస్తున్నట్లు తెలుస్తోంది.

మరోవైపు ఫరూక్ అహ్మద్ కూడా ఓ బంగారు దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. అయితే, వ్యాపారంలో దాదాపు రూ.40 లక్షల వరకు నష్టపోయాడు. వాటి నుంచి బయటపడాలనే ఉద్దేశంతోనే.. ఇతర నేరగాళ్లతో జట్టు కట్టి దోపిడీకి పన్నాగం పన్నినట్లు పోలీసులు భావిస్తున్నారు. దోపిడీ జరిగిన వెంటనే కొంత బంగారాన్ని కరిగించినట్లు తెలుస్తోంది.

నిందితుడి నుంచి 2.865 కేజీల బంగారు ఆభరణాలు, రూ.4.80 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ కమిషనర్ తెలిపారు. మిగతా నిందితుల కోసం గాలిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం: ఖర్గే



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ సామాజిక న్యాయం 2.0 ఉద్యమాన్ని ప్రారంభించిందని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. బలహీన వర్గాల కోసమే ఈ న్యాయ పోరాటమన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వంలో సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ నిరంతరం పోరాటం చేస్తుందని చెప్పారు. దశాబ్దాలుగా అణచివేతకు గురైన ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ వర్గాల ప్రజల గొంతుకగా కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందని పేర్కొన్నారు. దేశ జనాభాలో మెజారిటీగా ఉన్నా.. కార్పొరేట్ బోర్డులు, న్యాయవ్యవస్థ, బ్యూరోక్రసీ, ఉన్నత విద్యా సంస్థల్లో వివక్ష కొనసాగుతోందన్నారు. కేంద్ర విశ్వవిద్యాలయాల్లోనూ అన్యాయం జరుగుతోందన్నారు. "దేశవ్యాప్తంగా జాతీయ కుల గణాంకాల సమీక్ష జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ప్రజల ఒత్తిడితోనే కులగణనకు మోదీ ప్రభుత్వం అంగీకారం తెలిపింది. కానీ, 50 శాతం రిజర్వేషన్ పరిమితిని తొలగించలేదు. తెలంగాణలో శాస్త్రీయంగా నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే దేశానికి ఆదర్శం కావాలి. బీసీ బిల్లు ప్రస్తుతం రాష్ట్రపతి ఆమోదం పొందాల్సి ఉంది. ఈ చరిత్రాత్మక ప్రయత్నంలో కృషి చేసిన విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డి నేతృత్వంలోని బృందానికి కృతజ్ఞతలు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ సీఎం, డిప్యూటీ సీఎం, మంత్రిమండలి, ఎంపీలకు ప్రత్యేక అభినందనలు" అని మల్లికార్జున ఖర్గే తెలిపారు.



## తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జన్మదిన వేడుకలు

హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ జన్మదిన వేడుకలు తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. పార్టీ నేతలు, కార్యకర్తల మధ్య కేటీఆర్ కేక్ కట్ చేశారు. వివిధ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కార్యకర్తలు తెలంగాణ భవన్‌కు తరలివచ్చి ఆయనకు బర్త్‌డే విషెస్ తెలిపారు. వారందరికీ కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. తనను అభిమానించే వారి ప్రేమ, ఆశీర్వాదాలతో మరింత ఉత్సాహంగా ప్రజాసేవలో పాల్గొంటానని చెప్పారు.

ఈ వేడుకల్లో మాజీ మంత్రులు మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ తదితరులు పాల్గొన్నారు.

## మీలా ట్యాపింగ్ చేయాల్సిన అవసరం మా సీఎంకు లేదు: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ చేస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి నేతలు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని.. ఆ అవసరం తమ నాయకుడు, సీఎం రేవంత్‌రెడ్డికి లేదని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రేవంత్ సమర్థుడని చెప్పారు. గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆది శ్రీనివాస్ మాట్లాడారు. "ప్రజాస్వామ్యం ఉన్న పార్టీ మాది. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే ప్రజా ప్రభుత్వం. మా మంచి పాలనను ఓర్వలేక విష ప్రచారం చేస్తున్నారు. ప్రతిపక్ష పాత్ర కూడా కేసీఆర్ సరిగా నిర్వహించలేకపోతున్నారు. ఇప్పటికే భారాసకు ప్రజలు బుద్ధి చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే జరుగుతుంది. ఫామ్‌హౌస్‌కే పరిమితమవుతూ విమర్శించడం సరికాదు. మీలా ట్యాపింగ్‌తో రాజకీయాలు చేయాల్సిన అవసరం మా ముఖ్యమంత్రికి లేదు. మాకు మా నాయకుల మీద నమ్మకం, విశ్వాసం ఉంది. గత ప్రభుత్వంలో భార్యాభర్తలు, సినీతారలు, జడ్జిలు మాట్లాడిన కాల్స్ ట్యాప్ చేశారు." అని ఆది శ్రీనివాస్ అన్నారు.




అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిరిండియా విమాన ప్రమాద ఘటన ప్రతిఒక్కరిని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆ ప్రభావం పైలట్లపైనా చూపించింది. దాంతో ఆ సంస్థకు చెందిన 100 మందికిపైగా పైలట్లు సిక్‌లీవ్ తీసుకున్నారు. ఈ విషయాన్ని పార్లమెంట్‌కు కేంద్రం వెల్లడించింది. "గత నెల 12వ తేదీన జరిగిన దుర్ఘటన తర్వాత ఎయిరిండియాలో సిక్‌లీవ్స్ సంఖ్యలో పెరుగుదల కనిపించింది. నాలుగురోజుల వ్యవధిలో ఆ సెలవులు తీసుకున్నవారి సంఖ్య 112గా ఉంది. వారిలో 51 మంది కమాండర్లు, 61 మంది ఫస్ట్ ఆఫీసర్లు ఉన్నారు" అని పౌర విమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ లోక్‌సభకు వెల్లడించారు. అలాగే 2023లో విమానయాన సంస్థలకు ఇచ్చిన నోటీసుల గురించి ప్రస్తావించారు. సిబ్బందికి వైద్య పరీక్షల సమయంలో త్వరితగతిన మానసిక ఆరోగ్యాన్ని అంచనా వేయడానికి కావాల్సిన పద్ధతులు ఉండాలని వాటిల్లో పేర్కొన్నట్లు వెల్లడించారు. ఏదైనా సమస్య ఉత్పన్నమైనప్పుడు విమానయాన సిబ్బంది, ఎయిర్‌ట్రాఫిక్ కంట్రోల్ ఆఫీసర్లకు సహాయం చేసేందుకు పీర్ సపోర్ట్ గ్రూప్‌లను ఏర్పాటు చేయాలని ఆ సమయంలో సలహాఇచ్చారు. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిరిండియా ఏఐ171 విమాన ప్రమాదంలో 241 మంది చనిపోయారు. అది భవనంపై కుప్పకూలడంతో మొత్తం మృతుల సంఖ్య 260కి చేరింది. ఈ నేపథ్యంలో డైరెక్టరైట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ కీలక చర్యలు చేపడుతున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా విమానాల్లో భద్రత, సిబ్బంది వ్యవహారాలపై కఠినంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇందులో భాగంగా ఎయిరిండియాకు తాజాగా నాలుగు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. క్యాబిన్ సిబ్బంది విశ్రాంతి, శిక్షణా నిబంధనలు, నిర్వహణ కార్యకలాపాలకు సంబంధించి ఉల్లంఘనలు జరిగిన అంశాన్ని ఎయిరిండియా అంగీకరించినట్టు తెలుస్తోంది.

Printed, Published and owned by VISHWANATH V and Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, RNI Regd. No. TELTEL/2023/86207, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com